నేటి కందం-నేటికి అందం

పవన ఘట సౌర విద్యు
త్తవిరామమ్ముగ నొసగగ తనదగు శైలిన్
నవ పథమున మన ప్రగతిని
ప్రవచించుచు నేటి ప్రభుత ప్రారంభించెన్!!

(ఐదు వేల ఏడు వందల యాభై కోట్ల రూపాయల పెట్టుబడితో కర్నూలు దగ్గర పత్తికొండ లో ఎనిమిది వందల మెగావాట్ల పవన సౌర బ్యాటరీ విద్యుత్ ప్రాజెక్టు కు ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం టాటా వారి సబ్సిడరీని ప్రారంభించింది.)



-రాధశ్రీ
సెల్:9494481210

# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com  ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433  E-mail:netinijam93@gmail.com

చురక

ప్రభుత్వాల్లో రాజకీయ
ప్రాముఖ్యతే పైచేయి
పథకాలు అభివృద్ధి
పరుగెత్తవు అన్నీ గాయి
తమ పార్టీకి లాభమైతే
తప్పు ఏది చేయబోరు
ఎవరేమి అనుకున్నా
ఎప్పటికీ వదులుకోరు.



-వేల్పుల నారాయణ
9440433475

హైదరాబాద్ శనివారం 1-8-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 ▪ Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :32 సంచిక:281 పేజిలు:6 వెల: రూ.1/-


## రష్యా-ఉక్రెయిన్ యుద్ధంలో ప్రాణాలు కోల్పోయిన భారతీయ కుటుంబాలకు న్యాయం చేయండి.. సుప్రీంకోర్టు ఆదేశం

న్యూఢిల్లీ, జులై 31 రష్యా-ఉక్రెయిన్ యుద్ధంలో భారీ సంఖ్యలో భారతీయులు కూడా పాల్గొన్నారు. వీరిలో కొందరు ప్రాణాలు కోల్పోగా.. ఇంకొందరు గాయపడ్డారు. మరికొందరి గురించి అసలు సమాచారమే లేదు. దీంతో వారి కుటుంబాలకు న్యాయం చేయాల్సిందిగా కేంద్ర ప్రభుత్వాన్ని భారత సుప్రీంకోర్టు ఆదేశించింది. రష్యా-ఉక్రెయిన్ యుద్ధంలో బలైన భారతీయ కుటుంబాలకు సహాయం అందించేందుకు కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ ఆధ్వర్యంలో ఒక నోడల్ అధికారిని నియమించాలని కేంద్రాన్ని సుప్రీంకోర్టు శుక్రవారం ఆదేశించింది. అలాగే, ఈ యుద్ధంలో ప్రాణాలు కోల్పోయిన, గాయపడ్డ, మిస్సైన వారి వివరాలను బాధిత కుటుంబాలకు స్థానిక భాషలో అందజేయాల్సిందిగా కూడా ప్రభుత్వానికి కోర్టు సూచించింది.

నిజానికి రష్యా-ఉక్రెయిన్ యుద్ధంలో పాల్గొన్న భారతీయులకు సంబంధించిన వివరాలపై అధికారిక ప్రకటన ఏదీ లేదు. ఇదే సమయంలో ప్రభుత్వం కూడా ఎలాంటి వివరాల్ని వెల్లడించలేదు. దీంతో ఇంతకాలంగా ఈ విషయంలో తమ వారిని దూరం చేసుకున్న భారతీయ కుటుంబాలు తమకు న్యాయం చేయాలని కోరుతూ సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. దీనిపై సుప్రీం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చి, జస్టిస్ వీ మోహన్ ఆధ్వర్యంలోని బెంచ్ విచారణ జరిపింది. ఈ సందర్భంగా ప్రభుత్వానికి కీలక ఆదేశాలు జారీ చేసింది. బాధిత కుటుంబాల డీఎన్ఏ సేకరించి, మృతుల డీఎన్ఏతో పోల్చి, వారి మృతదేహాల్ని లేదా అస్థికల్ని కుటుంబ సభ్యులకు అందజేయాలని కోరింది. ఇండియాలోని రష్యా రాయబార కార్యాలయం నుంచి బాధితులకు సంబంధించి తగిన వివరాలు సేకరించాలని, నష్టపరిహారం కూడా అందజేయాలని కోర్టు సూచించింది. ఈ విషయంలో బాధిత కుటుంబాలకు నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ (ఎన్ఏఎల్ఎస్ఏ), స్టేట్ లీగల్ సర్వీసెస్‌లు సహాయం అందించాలని సూచించింది.

మృతదేహాలను లేదా అస్థికలను బాధిత కుటుంబాలకు అందజేయడంలో, పరిహారం అందజేయడంలో సహాయం చేయాలని ఆదేశించింది. దీనికి సంబంధించిన ప్రక్రియ ప్రారంభించాలని, బాధిత కుటుంబాలకు పరిహారం, న్యాయం అందేలా రష్యా రాయబార కార్యాలయాల్ని ఆదేశించేలా దావా దాఖలు చేయాలని కూడా కేంద్రాన్ని కోరింది. ఈ పరిహారం విదేశీ వ్యవహారాల శాఖ ద్వారా మాత్రమే అందజేయాలని సూచించింది. ఈ పరిహారం అందడం ఆలస్యమైనంత మాత్రాన మృతదేహాల్ని అప్పగించడంలో ఆలస్యం చేసి, అంత్యక్రియలు నిర్వహించడంలో ఆలస్యం జరిగేలా చేయొద్దని కూడా సూచించింది. 2024, 2025లో చాలా మంది భారతీయులు వివిధ వర్క్ వీసాలపై రష్యా వెళ్లారు. అయితే, అక్కడ చాలామందిని రష్యా-ఉక్రెయిన్ యుద్ధంలో వాడుకున్నట్లు ఆరోపణలున్నాయి.

## నాలుగంతస్తుల భవనం కూలి 9 మంది మృతి



న్యూఢిల్లీ, జులై 31ముంబైకి దగ్గరలో ఉన్న భీవండిలో గురువారం రాత్రి సుమారు 11:30 సమయంలో నాలుగు అంతస్తుల భవనం కూలింది. ఈ ప్రమాదంలో 9 మంది మరణించారు. ఈ భవనంలో ప్రతి అంతస్తుకు 12 గదుల చొప్పున మొత్తం 48 గదులు ఉన్నాయి. ఈ భవనం కూలిపోయే ప్రమాదం ఉందని మున్సిపల్ అధికారులు తెలిపారు. దీంతో అక్కడ మరమ్మతు పనులు చేపట్టారు. ఈ సమయంలో భవనం కూలిపోయింది.

రాత్రి 9 గంటల సమయంలో భవనం నుంచి విరిగిపడుతున్న శబ్దం రావడంతో స్థానికులు అధికారులకు తెలిపారు. వెంటనే అధికారులు స్పందించి భవనంలోని కొన్ని కుటుంబాలను సురక్షిత ప్రాంతానికి తరలించారు. ఇంకా కొంతమందిని తరలించే క్రమంలో భవనం ఒక్కసారిగా కుప్పకూలింది. అగ్నిమాపక సిబ్బంది శిథిలాలు తొలగించి మృతదేహాలను వెలికితీశారు. గాయపడినవారిని ఆస్పత్రికి తరలించారు.

## లక్ష్యాలను నెరవేర్చకపోతే కఠిన చర్యలు తప్పవు.. ఆయిల్ పామ్ కంపెనీలకు తుమ్మల ఆదేశాలు



హైదరాబాద్, జులై 31: ఆయిల్ పామ్ కంపెనీలతో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈరోజు(శుక్రవారం) రాష్ట్ర సచివాలయంలో జరిగిన సమావేశంలో ఆయిల్ పామ్ సాగు విస్తరణపై కీలకంగా చర్చించారు. ఆయిల్ పామ్ కంపెనీల లక్ష్యాలు, మిల్లుల నిర్మాణ పనులు తదితర అంశాలపై ప్రధానంగా చర్చించారు. ఈ సందర్భంగా అధికారులకు మంత్రి ఆదేశాలు జారీ చేశారు. కంపెనీల లక్ష్యాల సాధనపై మంత్రి ఆరా తీశారు. ఆయిల్ పామ్ ప్రాసెసింగ్ మిల్లుల పనులపై సమీక్షించారు.

మిల్లుల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని ఆదేశాలు జారీ చేశారు. రైతులకు అందుతున్న సేవలపై అధికారులను ప్రశ్నించారు. ప్రభుత్వ లక్ష్యాలను ఆయిల్ పామ్ కంపెనీలు తప్పనిసరిగా సాధించాలని స్పష్టం చేశారు. లక్ష్యాలు నెరవేర్చని కంపెనీలపై కఠిన చర్యలు తప్పవని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హెచ్చరించారు.

## శాంతి భద్రతల పరిరక్షణ కోసమే కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం.. వేములవాడ డీఎస్పీ శ్రీనివాసులు

**-అసాంఘిక కార్యకలపాలకు పాల్పడితే కఠిన చర్యలు**
**-స్వీయరక్షణార్థం కాలనీలల్లో సీసీ టీవీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి**
**-అనుమానిత వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వండి**
**-సరైన పత్రాలు లేని 39 ద్విచక్ర వాహనాలు గుర్తింపు**



రాజన్న సిరిసిల్ల, జులై 31:(నేటినిజం ప్రతినిధి): రాజన్నసిరిసిల్ల జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణే లక్ష్యంగా జిల్లా ఎస్పీ మహేష్ బీ గితే ఆదేశాల మేరకు శుక్రవారం వేములవాడ డీఎస్పీ ఆధ్వర్యంలో కోనరావుపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని గొల్లపల్లి, కమ్మరి పేట తండాలల్లో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సరైన పత్రాలు, నంబర్ ప్లేట్లు లేని 39 ద్విచక్ర వాహనాలను గుర్తించి, సంబంధిత యజమానులు అవసరమైన పత్రాలు సమర్పించి వాహనాలను తీసుకెళ్లాలని సూచించారు. నేరాల నియంత్రణలో భాగంగా పోలీసులు అనుమానిత వ్యక్తులను (సస్పెక్ట్స్) తనిఖీ చేసి, వారి ప్రస్తుత కదలికలు, స్థితిగతులపై ఆరా తీశారు. ప్రజల రక్షణతో పాటు వారికి భద్రతాభావం కల్పించడం, అసాంఘిక కార్యకలాపాలను అరికట్టడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డిఎస్పీ శ్రీనివాసులు తెలిపారు.

ఈ కార్యక్రమం ద్వారా ప్రాంతాల్లోకి కొత్తగా వచ్చే వ్యక్తులు లేదా నేరస్తులు షెల్టర్ తీసుకుంటున్నారా అనే విషయాలు కూడా గుర్తించే అవకాశం ఉంటుందన్నారు. అలాగే స్వీయ రక్షణ కోసం కాలనీల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, ఈ విషయంలో పోలీస్ శాఖ పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు. భద్రతా పరమైన అంశాల్లో మరియు నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. కాలనీలలో ఎవరైనా అనుమానాస్పదంగా తిరుగుతూ కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు.

యువత అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని, తల్లిదండ్రులు తమ పిల్లలను చదువుపై దృష్టి పెట్టేలా ప్రోత్సహించాలని సూచించారు. గంజాయి అక్రమ రవాణా, నిల్వ, సరఫరా వంటి అంశాలపై ఎవరైనా సమాచారం ఉంటే పోలీసులకు తెలియజేయాలని, సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని హామీ ఇచ్చారు. ఎవరైనా ప్రజా జీవనానికి భంగం కలిగించిన, చట్ట వ్యతిరేకమైన కార్యకలాపాలకు పాల్పడిన చట్టపరమైన కఠినమైన చర్యలు తప్పవని డీఎస్పీ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో చందుర్తి సర్కిల్ సీఐ రవీందర్, ఎస్ఐ ప్రశాంత్ రెడ్డి, రమేష్, మోతీలాల్, సిబ్బంది పాల్గొన్నారు.

## తెలంగాణ సంస్కృతికి ప్రతీక బోనాలు : తలసాని శ్రీనివాస్ యాదవ్



హైదరాబాద్, జులై 31:తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బోనాల ఉత్సవాలు ప్రతీక అని మాజీమంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఆగస్టు 2 వ తేదీన సికింద్రాబాద్ లోని శ్రీ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి బోనాల జాతర జరగనున్న నేపథ్యంలో శుక్రవారం ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అధికారులతో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ 200 సంవత్సరాల చరిత్ర కలిగిన మహంకాళి అమ్మవారి జాతరకు వివిధ ప్రాంతాల నుండి లక్షలాది మంది భక్తులు వస్తారని తెలిపారు. భక్తులు ఎలాంటి అసౌకర్యానికి గురికాకుండా వివిధ శాఖల ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కేసీఆర్ ప్రభుత్వం బోనాల ఉత్సవాలను రాష్ట్ర పండుగగా ప్రకటించి బోనాల విశిష్టతను పెంచిందని గుర్తు చేశారు. అంతేకాకుండా బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలనే ఆలోచనతో దేవాలయాలకు కేసీఆర్ ప్రభుత్వమే మొట్టమొదట నిధులు ఇచ్చిందని వివరించారు. ఎమ్మెల్యే వెంట జోనల్ కమిషనర్ మంగ తాయారు, వాటర్ వర్క్స్ జీఎం శ్రీధర్, ఆలయ ఈవో మనోహర్ రెడ్డి, ఏఈ చంద్రశేఖర్, మాజీ కార్పొరేటర్లు అత్తిలి మల్లిఖార్జున్ గౌడ్, అత్తిలి అరుణ గౌడ్, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు అత్తిలి శ్రీనివాస్ గౌడ్, ఆకుల హరికృష్ణ, నాయకులు కిశోర్, సతీష్, కోటేశ్వర్ గౌడ్, కొండాపురం మహేష్ యాదవ్, గణేష్, జనార్దన్, రాజు, చంద్ర ప్రకాష్, అరుణ్ భట్, జయరాజ్, సత్యనారాయణ, డెక్కన్ మానవ సేవా సమితి, ఆర్య సమాజ్, పలు స్వచ్ఛంద సంస్థల వాలంటీర్లు తదితరులు ఉన్నారు.

## వచ్చే వారం సోలార్ ప్లాంట్ ప్రారంభం

**-ఖిలా వనపర్తి ప్లాంట్ పనులు వెంటనే పూర్తి చేయాలి**
**-ఎలిగేడులో 15 వేల మెట్రిక్ టన్నుల గోదాం నిర్మాణం వేగవంతం చేయాలి**
**-కలెక్టర్ కోయ శ్రీహర్ష**

కరీంనగర్, జులై 31: ధర్మారం మండలంలోని ఖిలా వనపర్తి గ్రామంలో నిర్మాణం పూర్తయిన సోలార్ ప్లాంట్‌ను వచ్చే వారం ప్రారంభించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఖిలా వనపర్తి గ్రామంలోని సోలార్ ప్లాంట్‌ను పరిశీలించిన కలెక్టర్, నిర్మాణ పనుల పురోగతిని సమీక్షించారు. ప్రారంభోత్సవానికి అవసరమైన ఏర్పాట్లను వెంటనే పూర్తి చేసి, ప్లాంట్‌ను వచ్చే వారం ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం ఎలిగేడు మండలంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్మించనున్న 15 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యంగల గోదాం కోసం ప్రతిపాదించిన స్థలాన్ని పరిశీలించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గోదాం నిర్మాణానికి సంబంధించిన టెండర్ల ప్రక్రియను ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. టెండర్లు పూర్తయిన వెంటనే నిర్మాణ పనులు ప్రారంభించి, నిర్ణీత గడువులో నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని సూచించారు. రైతులకు ఆధునిక నిల్వ సౌకర్యాలు అందుబాటులోకి వచ్చేలా గోదాం నిర్మాణాన్ని వేగవంతం చేయాలని, పనుల అమలులో ఎలాంటి జాప్యానికి తావు లేకుండా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి (డీసీఓ) శ్రీమాల, ధర్మారం తహసీల్దార్ శ్రీనివాస్, ఎలిగేడు తహసీల్దార్ యాకన్న, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## నకిలీ నంబర్ ప్లేట్లపై ట్రాఫిక్ పోలీసుల ఉక్కుపాదం.. క్రిమినల్ కేసులు నమోదు

హైదరాబాద్, జులై 31: నగరంలో వాహనాల నకిలీ నంబర్ ప్లేట్లపై ట్రాఫిక్ పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. గత వారం రోజులుగా పోలీసులు ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో నకిలీ నంబర్ ప్లేట్లు వినియోగిస్తున్న ఆరుగురిపై క్రిమినల్ కేసులు నమోదు చేశారు. సుల్తాన్‌బజార్, మెహదీపట్నం, బహదూర్‌పురాతోపాటు పెద్దపల్లి, మేడిపల్లి, కట్టంగూర్ ప్రాంతాల్లో ఈ కేసులు నమోదు చేశారు. అలాగే ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన పలు వాహనాలను పోలీసులు సీజ్ చేశారు.

ప్రభుత్వం ఆమోదించిన హెచ్ఎస్ఆర్‌పీ (ఊూఖీఖ) నంబర్ ప్లేట్లు మాత్రమే చెల్లుబాటు అవుతాయని ఈ సందర్భంగా పోలీసులు సూచించారు. ఊూఖీఖ కాకుండా ఇతర నంబర్ ప్లేట్లు వాడితే మాత్రం చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వాహనదారులను హెచ్చరించారు. నంబర్ ప్లేట్లపై స్టిక్కర్లు, డిజైన్లుతోపాటు అంకెల మార్చడం పూర్తిగా నిషేధమని స్పష్టం చేశారు.

## మొక్కలు విరివిగా నాటుదాం..

**-వర్షాకాలంలో పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి**
**-విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలి**
**-జెడ్పీ సీఈవో శ్రీనివాసరావు**

మహబూబ్‌నగర్, జులై 31:వనమహోత్సవంలో భాగంగా ప్రతి ఒక్కరూ విరివిగా మొక్కలు నాటి, వాటి సంరక్షణ బాధ్యతను స్వీకరించాలని నారాయణపేట జిల్లా పరిషత్ సీఈవో శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. మొక్కల పెంపకం ద్వారా పర్యావరణ పరిరక్షణతో పాటు భావితరాలకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించవచ్చని అన్నారు.

శుక్రవారం ఊట్కూర్ మండల కేంద్రంలో నిర్వహించిన డ్రై డే?ఫ్రైడే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం వనమహోత్సవ ర్యాలీని ప్రారంభించి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ప్రజలకు పరిసరాల పరిశుభ్రత, మొక్కల పెంపకం, వాటి సంరక్షణపై అవగాహన కల్పించారు. ప్రతి గ్రామంలో ఖాళీ ప్రదేశాలను గుర్తించి మొక్కలు నాటడంతో పాటు, వాటికి క్రమం తప్పకుండా నీరు అందించి సంరక్షించాలని అధికారులను ఆదేశించారు. వర్షాకాలంలో గ్రామాలు, పాఠశాలల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకుంటే సీజనల్ వ్యాధులను నివారించవచ్చని సూచించారు.

అంతకుముందు ఊట్కూర్ ఎంపీడీవో కార్యాలయాన్ని సందర్శించిన సీఈవో వివిధ రికార్డులను పరిశీలించి ప్రభుత్వ పథకాల అమలు తీరును సమీక్షించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో పావని మాట్లాడుతూ, కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ లేకపోవడంతో పరిపాలనా పనుల్లో ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. దీనిపై స్పందించిన శ్రీనివాసరావు, త్వరలోనే జూనియర్ అసిస్టెంట్ నియామకానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

అనంతరం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలను సందర్శించిన సీఈవో మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పరిశీలించారు. విద్యార్థులకు ప్రతిరోజూ మెనూ ప్రకారం నాణ్యమైన, రుచికరమైన భోజనం అందించాలని నిర్వాహకులకు సూచించారు. వంటశాల, పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు, నాణ్యమైన ఆహార పదార్థాలు, పరిశుభ్రమైన తాగునీరు అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పావని, ఎంఈవో మాధవి, డాక్టర్ సంతోషి, సూపరింటెండెంట్ పార్వతమ్మ, సీనియర్ అసిస్టెంట్ విద్యారాణి, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## పే స్కేల్ ను వెంటనే అమలు చేయాలి

**-నల్లబ్యాడ్జిలు ధరించి విబిజి రాంజీ ఉద్యోగుల నిరసన**



మహబూబాబాద్, జులై 31:(నేటినిజం ప్రతినిధి) పెద్దవంగర మండల కేంద్రంలో ఉపాధి హామీ పథకం అమలులో అత్యంత క్రియాశీలకంగా,బాధ్యతయుతంగా పనిచేస్తున్న విబిజి రామ్ జి (ఉపాధి హామీ) ఉద్యోగులకు పే స్కేల్ ఇవ్వాలని విబిజి రామ్ జి మండల సిబ్బంది డిమాండ్ చేశారు.రాష్ట్ర మరియు జిల్లా జెఎసి ఆదేశాల మేరకు మండల ఎంపిడిఓ కి వినతి పత్రం అందించి నల్లబ్యాడ్జి లు ధరించి నిరసన తెలియజేసారు. విబిజి రాంజీలో పనిచేస్తున్న ఉద్యోగులకు తక్షణమే పే స్కేల్ అమలు చేసి, తక్షణమే 3 నెలల పెండింగ్ వేతనాలను విడుదల చేయాలనీ, ప్రతి నెల 1వ తేదిన వేతనాలు చెల్లించాలని, ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలని కోరారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని, లేని యెడల సమ్మె కు కూడా వెనుకాడబోమని డిమాండ్ చేసారు.ఈ కార్యక్రమంలో సూదగాని యాకయ్య,సుమన్,సురేష్ మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

# బిడ్డకు జీవితకాల సురక్ష తల్లి రొమ్ము పాలు

## (01 – 07 ఆగష్టు "ప్రపంచ తల్లి రొమ్ము పాల వారోత్సవాలు" సందర్భంగా)

శిశువు జీవిత కాల ఆరోగ్య పరిరక్షణకు మాత్రమే కాకుండా తల్లి ఆయురారోగ్యాలకు, పౌర సమాజ ఆరోగ్య భాగ్యాలకు తల్లి రొమ్ము పాలు పట్టించడమే మాత్రమే ఏకైక సన్మార్గంగా పని చేస్తున్నదని శాస్త్రీయ అధ్యయనాలు రుజువు చేస్తున్నాయి. పిల్లల ఆరోగ్య పరిరక్షణ ఖర్చులను తగ్గించడంతో పాటు పిల్లల సంపూర్ణ అవయవాల ఎదుగుదలకు, సమాజ ఆర్థిక పరిపుష్టికి దోహదపడుతున్న తల్లి రొమ్ముపాలు శిశువులకు అమృత ఆహారంగా ఉపకరిస్తున్నది. తల్లి రొమ్ము పాల ప్రాధాన్యాన్ని అవగాహన పర్చడానికి ప్రతి ఏట 01 – 07 ఆగష్టు తొలి వారంలో "ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు(వరల్డ్ బ్రెస్ట్‌ఫీడింగ్ వీక్)" నిర్వహించడం ఆనవాయితీగా మారింది. ప్రపంచ తల్లి పాల వారోత్సవాలు-2026 ఇతివృత్తంగా "సుస్థిర శిశు ఆరోగ్యానికి కృషి చేద్దాం, ప్రయోజనకర రీతులను అందిద్దాం)" అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారం నిర్వహిస్తున్నారు. రొమ్ము పాలతో శిశువుకు అమ్మతో అవిభాజ్యమైన, అవ్యాజమైన జీవితకాలం పాటు పవిత్ర ప్రేమ ప్రారంభం కావడంతో పాటు తొలి రోజుల్లో శిశువు సమస్త దేహ అవయవాల ఎదుగుదలకు ఉపకరిస్తూనే తల్లికి కూడా ఎనలేని ఆరోగ్య మేలును చేస్తున్నది.

### రొమ్ము పాలతో తల్లికి, బిడ్డకు పలు ప్రయోజనాలు:

తల్లి రొమ్ము పాలు తాగిన శిశువు శరీర ఎదుగుదలకు అమృత ఆహారంగా పని చేస్తూనే జీవితకాలం పాటు పలు వ్యాధులు రాకుండా రక్షణ కవచంగా అడ్డుపడుతుంది. శిశువు ఎదుగుదలకు అవసరమైన అన్ని పోషకాలను అవసరం మేరకు అందించడం, మెదడు అభివృద్ధి, వ్యాధినిరోధకశక్తి బలపడడం, దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలకు అడ్డుపడడం, ఆహారం సులభంగా జీర్ణం కావడం, జీర్ణమైన ఆహారం తేలికగా శోషణం కావడం లాంటి అనేక ప్రయోజనాలను తల్లి రొమ్ము పాలు శిశువుకు కలిగి ఉంటాయి.

రొమ్ము పాలు తాగే పిల్లలతో పాటు రొమ్ముపాలు పట్టించే తల్లుల శారీరక ఆరోగ్యం, ఒవేరియన్ క్యాన్సర్/బిపీ/గుండె జబ్బులు/మధుమేహం లాంటి రుగ్మతలు రాకుండా అడ్డుపడడం, తల్లి శరీర బరువును నియంత్రించడం, బిడ్డతో బావోద్వేగ అనిర్వచనీయ పరమ పవిత్ర ప్రేమ బంధాన్ని ఏర్పరచడం లాంటి ప్రయోజనాలను కలుగజేస్తుంది.

### తొలి కాన్పు అయిన తల్లులకు చిట్కాలు:

నవజాత శిశువు జన్మించిన వెంటనే అమృత ఆహారంగా ముర్రు పాలను విధిగా శిశువుకు పట్టించాలి. శిశువుకు అవసరమయినపుడు మాత్రమే రొమ్ము పాలను తాగించాలి. సమయాన్ని చూసుకొని రొమ్ముపాలు పట్టించరాదు. రొమ్ము పాలు అందుతున్నట్లు గమనించాలి. తల్లి పాలు పట్టించడంలో అసౌకర్యంగా అనిపించినా అది నొప్పిగా మాత్రం భావించరాదు. శిశువుకు పాలు సరిపోతున్నట్లు నిర్ధారణ చేసుకోవాలి. రొమ్ము పాలు పట్టిందే తల్లులు తగిన విశ్రాంతి తీసుకోవాలి. ఏ అనుమానం వచ్చినా వెంటనే వైద్యులను సంప్రదించడానికి వెనకడుగు వేయరాదు. కుటుంబం, కార్యాలయాలు, పని ప్రదేశాల్లో తల్లులకు తగిన సదుపాయాలను కల్పించడంతో పాటు సహాయ సిబ్బందిని నియమించాలి.

తల్లి రొమ్ము పాలు పట్టించడం వల్ల శారీరక అందం తగ్గుతుందనే అనవసర భావనలకు తల్లులు స్వస్తి పలకాలి. బిడ్డ, తల్లి ఆరోగ్యం కన్న మరేదీ మిన్న కాదని తెలుసుకోవాలి. రొమ్ము పాలు పట్టించడం వల్ల శిశువుతో పాటు తల్లి ఆరోగ్యం కూడా సమకూరుతుందని గమనిస్తూ కనీసం ఏడాది నుంచి రెండేళ్ల పాటు రొమ్ము పాలు పట్టించడానికి సిద్ధంగా ఉండాలి. రేపటి తరం ఆరోగ్యానికి తల్లి రొమ్ము పాలు దీర్ఘకాలిక ఔషధంగా పని చేస్తుందని అమ్మలు నమ్మాలి.



-మధుపాళీ
9949700037

# ఉత్తరప్రదేశ్ లో విషపూరిత వాయువులు పీల్చి ఇద్దరి మృతి ఎన్ హెచ్ ఆర్ సీ నోటీసులు

న్యూఢిల్లీ, జులై 31ఉత్తరప్రదేశ్.. గౌతమ్ బుద్ధ నగర్ జిల్లా నోయిడాలో ఓ రెసిడెన్షియల్ సొసైటీలో సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంటు (ఎన్‌టీపీ) లోపల విషపూరిత వాయువులను పీల్చడంతో ఓ పారిశుధ్య కార్మికుడితో పాటు ఒక సెక్యూరిటీ గార్డు చనిపోయారని ఈ నెల 26న ప్రసార మాధ్యమాల్లో వచ్చిన వార్తా కథనాన్ని భారత జాతీయ మానవ హక్కుల సంఘం (ఎన్‌హెచ్‌ఆర్‌సీ) స్వయంగా పరిశీలనకు తీసుకుంది. వార్తా కథనంలో ప్రస్తావించిన ప్రకారం.. ట్యాంకును శుభ్రం చేయడానికి ఎస్‌టీపీలోకి ప్రవేశించిన పారిశుధ్య కార్మికుడు స్పృహ తప్పాడు. ఆ వ్యక్తి బయటకు రాకపోవడంతో, అతడిని కాపాడటానికి రెసిడెన్షియల్ సొసైటీ సెక్యూరిటీ గార్డుల్లో ఒకరు ట్యాంకులోకి వెళ్లి స్పృహ తప్పాడు.

వార్తా కథనంలో పేర్కొన్న అంశాలు నిజమే అయిన పక్షంలో, మానవ హక్కుల ఉల్లంఘన జరిగినట్లేనని ఎన్‌హెచ్ఆర్‌సీ పేర్కొన్నది. దీనికి అనుగుణంగా, గౌతమ్ బుద్ధ నగర్ జిల్లా మేజిస్ట్రేటుకు, పోలీస్ కమిషనరుకు ఎన్‌హెచ్‌ఆర్‌సీ నోటీసులు జారీ చేసి, ఈ ఘటనపై రెండు వారాల లోపల సమగ్ర నివేదికను అందించాలని స్పష్టం చేసింది. నివేదికలో దర్యాప్తు పురోగతి క్రమంతో పాటు, మృతుల ఆత్మీయులకు ఏదైనా నష్టపరిహారాన్ని చెల్లించి ఉంటే ఆ వివరాలను కూడా పంపాలని కోరింది.

2026 జులై 27న వెలుగులోకి వచ్చిన మీడియా కథనం ప్రకారం.. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది బాధితులను ఆస్పత్రిలో చేర్చారు. చికిత్సను అందిస్తున్న క్రమంలో... బాధితులు మరణించినట్లు ఆస్పత్రి వర్గాలు ప్రకటించాయి.

# అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దు..

## -ఎలాంటి నిస్సహాయ స్థితిలో ఉన్న 100కు డయల్ చేయండి
## -రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా

ఆదిలాబాద్, జులై 31:అత్యవసరమైతే తప్ప ఇంటి నుండి ఎవరు బయటికి రావద్దని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. ఎలాంటి నిస్సహాయ స్థితిలో ఉన్న 100 నెంబర్కు దయచేసి సమాచారం అందించినట్లయితే తక్షణమే సహాయ సహకారాలు చేసేందుకు పోలీస్ శాఖ సిద్ధంగా ఉందని తెలిపారు. అధికారులు జారీ చేసే సూచనలను తప్పనిసరిగా పాటిస్తూ పోలీస్ శాఖకు సహకరించాలన్నారు.

ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకొని పోలీస్ కమిషనరేట్ పరిధిలో డ్యాములు పర్యటక ప్రాంతాలను తాత్కాలికంగా మూసివేయడం జరిగిందని తెలిపారు. సాధారణ పరిస్థితులు నెలకొనే వరకు ఎవరు ఆ ప్రదేశాలకు వెళ్లకూడదని హెచ్చరించారు.

ప్రజలకు ఎలాంటి ప్రమాదం తలెత్తకుండా పోలీస్ శాఖ తరపున ముందస్తు బాధ్యత చర్యలు చేపట్టినట్లు అదేవిధంగా శాఖ పరమైన సూచనలు సలహాలు పాటిస్తూ జిల్లా ప్రజలు సహకరించాలని.. లోతట్టు ప్రాంతాల వద్దకు ఎవరు వెళ్లకుండా ప్రతి ఒక్కరు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు, వంకలు, కాలువలు, నదులు,రిజర్వాయర్లు, చెరువుల వద్దకు నిషేధ ఆజ్ఞలు అందజేశామని, చెట్ల కింద శిథిలవస్తులో ఉన్న భవనాలు లేదా పాడైన నిర్మాణాల వద్ద ఆశ్రయం పొందరాదన్నారు.

విద్యుత్ స్తంభాలు ట్రాన్స్ఫార్మర్లను తాకరాదని ఎట్టి పరిస్థితుల్లో నిబంధనలు మీద వద్దన్నాను స్థానిక రెవెన్యూ నీటిపారుదల శాఖ విద్యుత్ ఆర్ అండ్ బి వైద్య శాఖల అధికారులు సమన్వయంతో ముందుకు సాగాలని తెలిపారు. వాహనదారులు కల్వర్టులు చిన్నవంతులపై నీరు ప్రవహిస్తున్న సమయంలో దాటేందుకు ప్రయత్నించి రాదని ఎస్బిఐ బృందాలను సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు.




# 'ఇండియా మెడికల్ డివైస్-2026' నిర్వహణకు సన్నాహాలు

న్యూఢిల్లీ, జులై 31న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో 'ఇండియా మెడికల్ డివైస్-2026' 9వ దఫా సదస్సు ఆగస్టు 7న ప్రారంభమవుతుంది. "విశిష్ట భారత్ దిశగా: నాణ్యమైన వైద్య పరికరాల అంతర్జాతీయ కూడలిగా భారత్ రూపకల్పన" ఇతివృత్తంగా ఈ రెండు రోజుల సదస్సును కేంద్ర ఎరువులు-రసాయనాల మంత్రిత్వ శాఖ పరిధిలోని ఔషధ విభాగం నిర్వహిస్తుంది. భారత వాణిజ్య-పారిశ్రామిక సంఘాల సమాఖ్య (ఎఫ్ఐసీసీఐ-ఫిక్కీ) సహకారంతో ఔషధ విభాగం ఈ ప్రతిష్ఠాత్మక సదస్సు నిర్వహణ బాధ్యతలు చేపట్టింది. భారత్‌లో వేగంగా విస్తరిస్తున్న వైద్య పరికరాలు-మెడ్‌టెక్ రంగం భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికపై ఇందులో ప్రధానంగా చర్చిస్తారు. ఈ మేరకు విధాన రూపకర్తలు, నియంత్రణ సంస్థల ప్రతినిధులు, పరిశ్రమ అగ్రగాములు, ప్రపంచ భాగస్వాములు, ఆరోగ్య సంరక్షణ సంస్థలు, విద్యావేత్తలు, ఆవిష్కర్తలు తదితరలందర్నీ ఈ వేదిక ఏకం చేస్తుంది.

ఈ సదస్సు రెండో రోజు (ఆగస్టు 8)న "స్వయంసమృద్ధ మెడ్‌టెక్: విశిష్ట భారత్ వైపు వేగంగా దేశ ప్రస్థానం" అంశంపై కేంద్ర రసాయనాలు-ఎరువుల శాఖ మంత్రి శ్రీ జగత్ ప్రకాష్ నడ్డా ప్రసంగిస్తారు. ప్రపంచవ్యాప్తంగా పోటీపడగల, ఆవిష్కరణాత్మక వైద్య పరికరాల తయారీ వ్యవస్థకు రూపకల్పనపై ప్రభుత్వ దృక్కోణాన్ని ఆయన వివరిస్తారు. అలాగే, ఆ శాఖ సహాయ మంత్రి శ్రీమతి అనుప్రియా పటేల్ కూడా ప్రసంగిస్తారు. ఔషధ విభాగం కార్యదర్శి శ్రీ మనోజ్ జోషి, ఆరోగ్య-కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి శ్రీమతి పుణ్యసలిల శ్రీవాస్తవ, డ్రగ్స్ కంట్రోలర్ జనరల్ ఆఫ్ ఇండియా (డీసీజీఐ) డాక్టర్ రాజీవ్ సింగ్ రఘువంశీ, నీతి ఆయోగ్ సభ్యుడు (ఆరోగ్యం) డాక్టర్ ఎం.శ్రీనివాస్ సహా సీనియర్ అధికారులు, విధాన రూపకర్తలు, ప్రముఖ వైద్య పరికరాల కంపెనీల 'సీఈఓ'లు, పరిశ్రమ నిపుణులు, అంకుర-ఆరోగ్య సంరక్షణ-విద్యా సంస్థల ప్రతినిధులు కూడా ఈ రెండు రోజుల సదస్సులో పాల్గొంటారు.

వైద్య పరికరాల రంగం భవితను తీర్చదిద్దే అంశాలపై 'ఇండియా మెడికల్ డివైస్-2026' సదస్సు ఉన్నత స్థాయిలో చర్చిస్తుంది. ఇందులో భాగంగా పరికరాలు-విడిభాగాల తయారీ స్థానికీకరణ, పరీక్ష మౌలిక సదుపాయాలు, నాణ్యతా హామీ బలోపేతంపై దృష్టి సారిస్తారు. అంతేకాకుండా అధిక ప్రభావశీల, అధిక పరిమాణ ఉత్పాదిత పరికరాల రీత్యా సాంకేతిక అగ్రస్థానం సముపార్జన, కృత్రిమ మేధ, వైద్య ఉపకరణంగా సాఫ్ట్‌వేర్ సద్వినియోగం క్లినికల్ ఆధారాల సమీకరణ, నియంత్రణ మార్గాల మెరుగుదల, భారత వైద్య పరికరాల ఎగుమతి విస్తరణపైనా చర్చిస్తారు. అలాగే, సేవలు-నిర్వహణ వ్యవస్థల బలోపేతం, సార్వత్రిక ఆరోగ్య సంరక్షణకు మద్దతుగా వినూత్న చికిత్సలపై వ్యయం వాపసు చట్రాల రూపకల్పనపైనా చర్చలు కేంద్రీకృతమవుతాయి.

భారత వైద్య పరికరాల పరిశ్రమ విలువ ప్రస్తుతం 15 బిలియన్ డాలర్లకు పైగా నమోదవుతోంది. అందువల్ల ఆరోగ్య సంరక్షణ రంగంలో శరవేగంగా పురోగమించే విభాగాలలో ఒకటిగా ఇది ఆవిర్భవించింది. జాతీయ వైద్య పరికరాల విధానం-2023, ఉత్పత్తి సంధానిత ప్రోత్సాహక పథకం, వైద్య పరికరాల పార్కుల అభివృద్ధి, నియంత్రణ చట్రాల బలోపేతం, పరిశోధన-ఆవిష్కరణలు, నాణ్యమైన తయారీపై నిరంతర దృష్టి తదితర పరివర్తనాత్మక, విధానపరమైన కార్యక్రమాలు ఈ పరిశ్రమ వృద్ధికి తోడ్పడుతున్నాయి.

వైద్య పరికరాల విలువ వ్యవస్థ అంతటా అర్థవంతమైన చర్చలు, భాగస్వామ్యాలకు ప్రోత్సాహం ద్వారా ప్రపంచ మెడ్‌టెక్ కూడలిగా భారత్ స్థానాన్ని మరింత బలోపేతం చేయడమే 'ఇండియా మెడికల్ డివైస్-2026' లక్ష్యం. దేశీయ వైద్య పరికరాల తయారీ వ్యవస్థ వృద్ధిని వేగిరపరచే ఆధునిక సాంకేతికతలు, అంకుర ఆవిష్కరణలను ప్రదర్శించడం సహా పెట్టుబడులు, సాంకేతిక సహకారం, ఆవిష్కరణలు, ప్రపంచ ఉత్తమ పద్ధతుల అనుసరణను ప్రోత్సహించడం కూడా ఈ సదస్సు ధ్యేయం. వికసిత భారత్-2047 దార్శనికతకు అనుగుణంగా ఆవిష్కరణాధారిత, స్వయం సమృద్ధ, అంతర్జాతీయ పోటీతత్వంతో కూడిన వైద్య పరికరాల రంగానికి రూపమివ్వడంపై భారత్ నిబద్ధతను పునరుద్ఘాటిస్తూ, ఈ సదస్సులో ప్రముఖ జాతీయ, అంతర్జాతీయ భాగస్వాములు పాల్గొంటున్నారు.

# గిరిజన వర్గాల తరలింపుపై కేంద్రం స్పష్టీకరణ

న్యూ ఢిల్లీ, జులై 31:షెడ్యూల్డ్ తెగలు, ఇతర సంప్రదాయ అటవీ వాసుల (అటవీ హక్కుల గుర్తింపు-ఎఫ్ఆర్ఏ) చట్టం 2006 కింద గిరిజన హక్కులకు సంబంధించిన సమస్యలపై ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన వన గుజ్జర్ వర్గాల నుంచి అందిన వినతి పత్రాలను పరిశీలించినట్లు కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ సహాయ మంత్రి శ్రీ దుర్గాదాస్ ఉయికే వెల్లడించారు. నేడు లోక్‌సభలో అడిగిన ఓ ప్రశ్నకు సమాధానంగా ఆయన ఈ వివరాలను తెలిపారు.

అటవీ హక్కుల చట్టం అమలు బాధ్యత పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్రపాలిత ప్రాంతాల పరిధి లోనే ఉంటుందని అందుకే ఆ యా వినతిపత్రాలను పరిశీలన నిమిత్తం సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాలకు, జిల్లా యంత్రాంగాలకు పంపినట్లు మంత్రి స్పష్టం చేశారు. ఎఫ్ఆర్ఏ చట్ట నిబంధనలు, ఇతర సంబంధిత చట్టాలకు అనుగుణంగా పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు చెప్పారు.

అటవీ హక్కుల చట్టం (ఎఫ్ఆర్ఏ) నిబంధనలను కచ్చితంగా పాటించాలని కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ అన్ని రాష్ట్ర ప్రభుత్వాలను, కేంద్రపాలిత ప్రాంతాలను కోరుతోంది.

# వికసిత్ భారత్ సంకల్ప్ అభియాన్ కోసం ఆగస్ట్ 2 న నషా ముక్త యువ కార్యక్రమం ప్రారంభం

న్యూఢిల్లీ, జులై 31:నషా ముక్త్ భారత్, వికసిత్ భారత్-2047 స్వప్నాన్ని సాకారం చేయటంలో భాగంగా ఆగస్ట్ 2, 2026న "వికసిత్ భారత్ సంకల్ప్ అభియాన్ కోసం నషా ముక్త యువ" కార్యక్రమాన్ని ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ప్రారంభిస్తారు. జన్ భాగీదారీ స్ఫూర్తితో మాదకద్రవ్యాల దుర్వినియోగానికి వ్యతిరేకంగా జరిగే ప్రజా ఉద్యమానికి నాయకత్వం వహించాలని దేశ యువతకు ప్రధానమంత్రి పిలుపునిచ్చారు.

ప్రధానమంత్రి పిలుపు మేరకు దేశవ్యాప్తంగా యువత క్రియాశీలక భాగస్వామ్యంతో మై భారత్ ఆధ్వర్యంలో జన ఉద్యమంగా ఈ ప్రచారం ప్రారంభం అవుతుంది. అవగాహన కల్పించటం, సామాజిక భాగస్వామ్యం, సుస్థిర భాగస్వామ్యాన్ని ప్రోత్సహించటం ద్వారా మాదకద్రవ్య రహిత భారత్‌ను నిర్మించాలనే సమష్టి జాతీయ లక్ష్యంతో యువతను ఏకం చేయటమే ఈ కార్యక్రమం ఉద్దేశం.

ప్రధానమంత్రి ప్రసంగం స్ఫూర్తితో దేశవ్యాప్తంగా సుమారు 10,000 ప్రాంతాల్లో ఒకేసారి ప్రతిజ్ఞను నిర్వహించనున్నారు. డ్రగ్స్ రహిత సమాజం కోసం నిబద్ధతను తెలియజేస్తూ, నషా ముక్త యువ వాలంటీర్లుగా దేశ నిర్మాణానికి తమను అంకితం చేసుకుంటూ... కోటి మందికి పైగా యువత నషా ముక్తి ప్రతిజ్ఞలో పాల్గొంటారు.

ఈ ప్రచారంలో మై భారత్ వాలంటీర్లు, మై భారత్ నేషనల్ సర్వీస్ స్కీమ్ (ఎన్ఎస్ఎస్) వాలంటీర్లు, యూత్ క్లబ్బులు, పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలు, ప్రభుత్వేతర సంస్థలు, పారిశ్రామిక సంఘాలు, 125కు పైగా ఆధ్యాత్మిక సంస్థలు పాల్గొంటాయి. మాదకద్రవ్యాల దుర్వినియోగానికి వ్యతిరేకంగా యువత నేతృత్వంలో జరుగుతున్న అతిపెద్ద ప్రజా ఉద్యమాల్లో ఒకటిగా ఈ కార్యక్రమం నిలవనుంది.

సాధారణ అవగాహన కార్యక్రమాల మాదిరిగా కాకుండా "వికసిత్ భారత్ సంకల్ప్ అభియాన్ కోసం నషా ముక్త యువ" కార్యక్రమాన్ని 100 వారాల పాటు సాగే ప్రజా భాగస్వామ్య ఉద్యమంగా రూపొందించారు. ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించేందుకు, సామాజిక భాగస్వామ్యాన్ని బలోపేతం చేయటానికి, దేశ నిర్మాణం దిశగా యువశక్తిని మళ్లించేందుకు రాబోయే 100 వారాల పాటు ప్రతి ఆదివారం దేశవ్యాప్తంగా యువత ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలను నిర్వహిస్తారు.

మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే హానికర ప్రభావాల గురించి సమాజంలో అవగాహన కల్పించటం, సానుకూల సామాజిక విలువలను పెంపొందించటం వంటి కార్యకలాపాలను ప్రతీ వారం నిర్వహిస్తారు. ఇందులో భాగంగా క్రీడా పోటీలు, వాకథాన్లు, ధ్యాన సదస్సులు, సాంస్కృతిక కార్యక్రమాలు, కళాత్మక, సృజనాత్మక పోటీలు, వీధి నాటకాలు, అవగాహనా కార్యక్రమాలు, ఇతర సామాజిక భాగస్వామ్య కార్యక్రమాలను నిర్వహిస్తారు.

నిరంతర భాగస్వామ్యాన్ని ప్రోత్సహించేందుకు, విశేష కృషిని గుర్తించేందుకు, ఈ ప్రచారంలో అద్భుతమైన సేవలందించే స్వచ్ఛంద కార్యకర్తలు, సంస్థలను.. 50, 75, 100 వారాలను పూర్తి చేసుకున్న కీలక సందర్భంగా సత్కరిస్తారు. దీని ద్వారా ప్రజా సేవ, ఉమ్మడి బాధ్యతా స్ఫూర్తిని బలోపేతం చేస్తారు.

దేశ ప్రయోజనాల దృష్ట్యా గౌరవ ప్రధానమంత్రి పిలుపుమేరకు ఈ చరిత్రాత్మక ఉద్యమంలో క్రియాశీలకంగా పాల్గొనాలని దేశవ్యాప్తంగా ఉన్న యువతను, సామాజిక సంస్థలను కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల శాఖ మంత్రి డాక్టర్ మన్‌సుఖ్ మాండవీయ కోరారు. లక్షలాది మంది యువత, వివిధ సంస్థలు, సామాజిక సంఘాల సమష్టి కృషితో మాదకద్రవ్యాల వినియోగాన్ని తిరస్కరించేలా వ్యక్తులకు స్ఫూర్తినిస్తూనే.. ఆరోగ్యకరమైన, బలమైన, మరింత అభివృద్ధి చెందిన భారత్ నిర్మాణానికి దోహదపడే దేశవ్యాప్త సామాజిక ఉద్యమాన్ని రూపొందించటమే ఈ ప్రచార లక్ష్యం.

మాదకద్రవ్యాలపై పోరాటాన్ని పౌరుల క్రియాశీల భాగస్వామ్యంతో నడిచే ప్రజా ఉద్యమంగా మార్చాలనే ప్రధానమంత్రి దృక్పథాన్నివికసిత్ భారత్ సంకల్ప్ అభియాన్ కోసం నషా ముక్త యువ కార్యక్రమం ప్రతిబింబిస్తుంది. "మాదకద్రవ్య రహిత యువతే వికసిత్ భారత్‌కు అత్యంత బలమైన శక్తి" సందేశం ద్వారా జాతీయ సంకల్పాన్ని ప్రతి గ్రామానికి, పట్టణానికి, నగరానికి తీసుకెళ్లటం.. వికసిత్ భారత్-2047 దిశగా భారత్ ప్రయాణాన్ని మరింత బలోపేతం చేయటమే ఈ ప్రచారం ఉద్దేశం.

# జలమయమైన శ్రీలంక కాలనీ ప్రాంతాన్ని పరిశీలించిన సీఐ..




ఆదిలాబాద్, జులై 31:మంచిర్యాల జిల్లా జన్నారం మండలంలోని పొనకల్ మేజర్ గ్రామపంచాయతీలోని శ్రీలంక కాలనీ చుట్టూ నీరు చేరి జనం బయటకు వెళ్ళడానికి ఇబ్బందులు పడుతున్న విషయాన్ని తెలుసుకున్న లక్షెటిపేట సీఐ రమణమూర్తి గురువారం సాయంత్రం ఆ కాలనీ పరిశీలించారు. శ్రీలంక కాలనీ చుట్టూ వరద నీరు చేయడంతో ఆ కాలనీవాసుల ఇబ్బందులను సీఐ అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట స్థానిక ఎస్సై గుర్రం ఉదయ్ కిరణ్ ,పోలీసులు ఉన్నారు.

రోడ్డుపై పడ్డ చెట్టును తొలగించిన సీఐ..

మండలంలోని పైడిపల్లి గ్రామ సమీపాన ప్రధాన రోడ్డుకు అడ్డంగా పడి ఉన్న భారీ వృక్షాన్ని లక్షెట్టిపేట సీఐ రమణమూర్తి స్వయంగా దగ్గరుండి కానిస్టేబుల్ చంద్రమౌళి,కూలీలచే కొమ్ములు కొట్టివేయించి తొలగించారు. ఈ సందర్భంగా సీఐని పలువురు అభినందించారు.

# రైస్ మిల్లులో విజిలెన్స్ ఆకస్మిక తనిఖీలు

కరీంనగర్, జులై 31: సీఎంఆర్ ధాన్యం నిల్వల్లో అక్రమాలను గుర్తించేందుకు విజిలెన్స్ అధికారులు శుక్రవారం పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ పట్టణ శివారులోని ఓ రైస్ మిల్లులో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. కరీంనగర్ రీజినల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి బస్వారెడ్డి రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన ఈ తనిఖీల్లో మిల్లులో ఉన్న సీఎంఆర్ ధాన్యం నిల్వలను పరిశీలించారు. పౌరసరఫరాల శాఖ నుంచి మిల్లుకు కేటాయించిన ధాన్యం, దానిని బియ్యంగా మార్చి తిరిగి శాఖకు ఎంత మేరకు అప్పగించారనే అంశాలపై అధికారులు లెక్కలు పరిశీలించారు.

ధాన్యం నిల్వల్లో తేడాలు ఉన్నాయనే అనుమానాల నేపథ్యంలో ప్రభుత్వం ఆదేశాల మేరకు రికార్డులను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. తనిఖీల్లో కరీంనగర్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీఎస్పీ సీతారెడ్డి, ఇన్‌స్పెక్టర్లు అనిల్, ప్రశాంత్, వరుణ్, డిప్యూటీ తహసీల్దార్ దినేష్‌తో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

# మహిళల నేతృత్వంలోని సంస్థలను ప్రభుత్వ కొనుగోళ్ల ద్వారా బలోపేతం చేయటానికి ఎంఓఆర్‌డీ, పీసీఐ ఇండియా మధ్య ఆర్థికేతర అవగాహనా ఒప్పందం

న్యూఢిల్లీ, జులై 31గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ (ఎంఓఆర్‌డీ), దీన్‌దయాళ్ అంత్యోదయ యోజన-జాతీయ గ్రామీణ జీవనోపాధుల మిషన్ (డీఏవై-ఎన్ఆర్ఎల్ఎం) ద్వారా మహిళా నేతృత్వంలోని సంస్థలను (డబ్ల్యూఎల్ఈలు) ముఖ్యంగా స్వయం సహాయక బృందాల (ఎస్‌హెచ్‌జీ) ఆధ్వర్యంలోని సంస్థలను ప్రభుత్వ కొనుగోళ్లు, మార్కెట్ అనుసంధానంతో కూడిన సంస్థాగత అభివృద్ధి ద్వారా బలోపేతం చేయటానికి ప్రాజెక్ట్ కన్సర్న్ ఇంటర్నేషనల్ (పీసీఐ) ఇండియాతో నేడు ఆర్థికేతర అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదుర్చుకుంది.

గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి శ్రీ రోహిత్ కన్సల్ అధ్యక్షతన ఈ అవగాహన ఒప్పందం జరిగింది. గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ (గ్రామీణ జీవనోపాధులు) శ్రీ స్వాతి శర్మ, పీసీఐ ఇండియా సీఈఓ, జాతీయ సంచాలకుడు శ్రీ ఇంద్రజిత్ చౌధురి ఈ అవగాహన ఒప్పందంపై సంతకాలు చేశారు.

బిల్, మెలిందా గేట్స్ ఫౌండేషన్ (బీఎంజీఎఫ్) మద్దతుతో "మహిళల ఆర్థిక సాధికారతకు ప్రభుత్వ కొనుగోళ్ల విధాన వినియోగం" ద్వారా 2022లో ప్రారంభించిన సహకారాన్ని ఈ అవగాహన ఒప్పందం లాంఛనప్రాయం చేస్తుంది. మహిళా నేతృత్వంలోని, ఎస్‌హెచ్‌జీ సంస్థలకు సంస్థాగత సంసిద్ధత, సామర్థ్య పెంపు, మార్కెట్ వసతులను కల్పించటం ద్వారా ప్రభుత్వ, సంస్థాగత కొనుగోళ్లలో భాగస్వామ్యాన్ని మెరుగుపరచాలని ఈ ఒప్పందం ఉద్దేశం.

2026-2029 కాలానికి సంబంధించిన మూడేళ్ల ఎంఓయూకు ఆర్థికేతర స్వభావం ఉంది. ఇరువర్గాల మధ్య ఎలాంటి నిధుల బదిలీ లేదా ఆర్థిక బాధ్యత ఉండదు. ఈ ఒప్పందం ద్వారా చేపట్టే కార్యకలాపాల కోసం ప్రతి వర్గం ఖర్చులను స్వయంగా భరిస్తాయి.

డీఏవై-ఎన్ఆర్ఎల్ఎం ద్వారా నేషనల్ రిసోర్స్ సెల్ (ఎన్ఆర్సీ), ప్రభుత్వ కొనుగోళ్లు, వ్యాపార నమూనా మద్దతు విభాగం ఏర్పాటు చేయాలనే ప్రతిపాదన ఈ భాగస్వామ్యంలో కీలక అంశం. దీనికి పీసీఐ ఇండియా సాంకేతిక మద్దతు అందిస్తుంది. ఈ విభాగం.. ఎస్ఆర్ఎల్ఎమ్‌ల్లో కొనుగోలు అనుసంధాన వాణిజ్య వ్యవస్థలను బలోపేతం చేయటానికి వ్యూహాత్మక, కార్యాచరణ మద్దతును అందిస్తుంది.

ఈ భాగస్వామ్యం ద్వారా సంస్థాగత ఇంక్యుబేషన్ ఫ్రేమ్‌వర్కులు, ఎస్ఓపీలు, ఆపరేషనల్ టూల్‌కిట్లు, ప్రామాణిక సామర్థ్య పెంపు మాడ్యూళ్ల అభివృద్ధికి మద్దతు లభిస్తుంది. ప్రభుత్వ ఇ-మార్కెట్‌ప్లేస్ (జెమ్) ఆన్‌బోర్డింగ్, టెండర్లలో పాల్గొవటం, నాణ్యతా ప్రమాణాలు, డాక్యుమెంటేషన్, కొనుగోళ్ల సమ్మతిపై ఎస్ఆర్ఎల్ఎమ్ బృందాలకు, ఎస్‌హెచ్ జీ సంస్థలకు శిక్షణ, చేదోడువాదోడుగా నిలవటం వంటి వాటిని ఇది సులభతరం చేస్తుంది. పునరుత్పాదక ఇంధన ఏకీకరణ, స్థిరమైన ఉత్పత్తి పద్ధతులు, సంబంధిత ప్రభుత్వ సంస్థలతో అనుసంధానం ద్వారా స్థిరమైన సంస్థాగత మోడళ్లను ఈ సహకారం మరింత అన్వేషించి, ప్రోత్సహిస్తుంది. 2026-27 ఆర్థిక సంవత్సరంలో ఇతర రాష్ట్రాలతో విస్తృతమైన భాగస్వామ్యానికి అవకాశం కల్పిస్తూనే.. మొదటగా అస్సాం, బీహార్, జార్ఖండ్, కర్ణాటక, మహారాష్ట్ర, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్‌లో ప్రత్యేక సాంకేతిక సహాయం అందించాలని ప్రతిపాదించారు. జాతీయ సాంకేతిక అభ్యాస సెషన్లు, అంతర్-రాష్ట్రాల మధ్య జ్ఞానాన్ని పంచుకోవటం, ఎంటర్‌ప్రైజ్ అవకాశాల మ్యాపింగ్, కొనుగోలు-అనుసంధాన వ్యాపార నమూనాల అభివృద్ధిని కూడా చేపడతాయి. ఎస్‌హెచ్‌జీ వ్యాపారాలకు ప్రభుత్వ కొనుగోలు మార్కెట్లలో ప్రవేశం కల్పించేందుకు స్థిరమైన, విస్తృతమైన వ్యాపారాల నిర్వహణకు, మహిళల ఆర్థిక సాధికారతను ముందుకు తీసుకెళ్లేందుకు సాంకేతిక మద్దతును అందించటంలో ఈ ఎంఓయూ కీలక ముందడుగా నిలుస్తుంది. ఈ భాగస్వామ్యం డీఏవై- ఎన్ఆర్ ఎల్ఎం లక్ష్యాలకు.. స్థిరమైన, వ్యాపార ఆధారిత, మార్కెట్-అనుసంధాన జీవనోపాధుల ద్వారా 6 కోట్ల మంది లఖ్‌పతి దీదీలను సృష్టించాలనే జాతీయ లక్ష్యానికి అనుగుణంగా ఉంది. గ్రామీణ మహిళలకు సమ్మిళిత, స్థిరమైన, మార్కెట్-ఆధారిత జీవనోపాధి అవకాశాలను ప్రోత్సహించటం ద్వారా వికసిత్ భారత్-2047, స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలు, భారతదేశ నెట్ జీరో ఆశయాల వంటి విస్తృత జాతీయ లక్ష్యాలను చేరుకునేందుకు ఈ సహకారం తోడ్పడుతుంది.

# పీఎంకేవీవై ద్వారా ఉపాధికల్పన

న్యూఢిల్లీ, జులై 31: ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన (పీఎంకేవీవై) ప్రస్తుత వెర్షను.. పీఎంకేవీవై 4.0..ను 2022-23 ఆర్థిక సంవత్సరం నుంచి అమలుచేస్తున్నారు. ఈ పథకంలో భాగంగా, శిక్షణను పొందిన అభ్యర్థులకు వివిధ కెరియర్ మార్గాల్ని ఎంపిక చేసుకొనేలా సాధికారతను సమకూరుస్తారు. వారికి ఆన్- జాబ్ ట్రయినింగ్ (ఓజేటీ) పద్ధతిలో పరిశ్రమకు సంబంధించిన నైపుణ్య ఆధారిత పాఠ్యక్రమాలను బోధించి సమర్థులుగా తీర్చిదిద్దడం ఈ పథకం ఉద్దేశం.

నాణ్యతనీ, జవాబు దారీతనాన్నీ నిర్ధారించడానికి పీఎంకేవీవైని తరచుగా అంచనా వేస్తోంది. ఈ మధ్యే, కేంద్ర ప్రభుత్వ ఆర్థిక శాఖకు చెందిన స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన సంస్థ అయిన 'అరుణ్ జైట్లీ జాతీయ ఆర్థిక సంస్థ' (ఏజేఎన్ఐఎఫ్ఎమ్) 'పీఎంకేవీవై 4.0'పై స్వతంత్ర తృతీయ పక్షం పరిశీలనను చేపట్టింది. ఈ ప్రక్రియను అస్సాం రాష్ట్రంతో పాటు దేశమంతటా పూర్తి చేశారు. స్వల్ప కాలిక శిక్షణను (ఎస్‌టీటీ) పొందిన అభ్యర్థులకు ఉపాధికల్పన అవకాశాలను చెప్పుకోదగిన స్థాయిలో మెరుగుపరిచే దిశగా పీఎంకేవీవై తోడ్పడినట్లు నివేదికలో పేర్కొన్నారు. ఉపాధిని పొందిన, స్వయంఉపాధికి మొగ్గు చూపిన ఎస్‌టీటీ అభ్యర్థులు పీఎంకేవీవై శిక్షణను పొందక ముందు 26.6 శాతంగా ఉంటే, శిక్షణను తీసుకున్న తరువాత 45.4 శాతానికి చేరారు. అంటే వీరి విషయంలో 18.8 శాతం వృద్ధి నమోదైంది. ఆదాయానికి సంబంధించిన ఫలితాలు కూడా సానుకూలంగా ఉన్నాయి. శిక్షణ పూర్తి చేసి, ధ్రువపత్రాలను అందుకున్న తరువాత 41.4 శాతం ఎస్‌టీటీ అభ్యర్థులతో పాటు 48.9 శాతం రికగ్నిషన్ ఆఫ్ ప్రయర్ లెర్నింగ్ (ఆర్‌పీఎల్) అభ్యర్థులు తమ ఆదాయాన్ని పెంచుకున్నట్లు తేలింది.

కేంద్ర నైపుణ్యాభివృద్ధి, ఔత్సాహిక పారిశ్రామికత్వం (ఎమ్ఎస్‌డీఈ) శాఖ సహాయ మంత్రి (స్వతంత్ర హోదా) శ్రీ జయంత్ చౌధరీ ఈ రోజు రాజ్యసభలో ఒక ప్రశ్నకు రాతపూర్వకంగా ఇచ్చిన సమాధానంలో ఈ సమాచారాన్ని తెలియజేశారు.

# ప్రకృతి పట్ల గౌరవం, పర్యావరణాన్ని సంరక్షించడం ముఖ్యం: ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, జులై 31ప్రకృతి, పర్యావరణం, సంపూర్ణ విశ్వం పట్ల గౌరవ భావంతో నడుచుకోవడం మన మనుగడకు మూలాధారమని ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ అన్నారు. దేశాన్ని ఆరోగ్యకరంగా, సౌభాగ్యవంతంగా, శక్తిమంతంగా రూపొందించడానికి కృతజ్ఞతతోనూ, ప్రకృతిపట్ల నిస్వార్థ సేవ భావంతో ముందుకు రావాలంటూ ప్రజలకు ఆయన పిలుపునిచ్చారు.

"శం నో ద్యావాపృథివీ పూర్వహూతౌ శమన్తరిక్షం దృశ్యే నో అస్తుశం న ఓషధీర్వనినో భవన్తు శం నో రజసస్పతిరస్తు జిష్ణుః" అనే సంస్కృత సుభాషితాన్ని ప్రజలతో ప్రధానమంత్రి పంచుకున్నారు.

సృష్టి ఆరంభం నుంచే మనం పూజనీయంగా భావిస్తున్న ఆకాశం, భూమీ మనకు శుభాలను అందిస్తున్నాయని ఈ సుభాషితం చెబుతోంది. భూమికీ, సూర్యునికీ మధ్య విస్తరించిన చోటు మన జీవితాలకు ప్రయోజనాలను అందించడంతో పాటు మనలో జ్ఞానాన్ని కూడా పెంపొందింప చేయుగాక. అన్ని ఔషధ మొక్కలూ, వన మూలికలూ మనకు ఆరోగ్యాన్నీ, పోషణనీ, సంతోషాన్నీ అందించుగాక. సర్వవ్యాప్తుడూ, విజేతా అయిన దైవం మనకు ఎప్పటికీ సంక్షేమాన్నీ, శాంతినీ, సౌభాగ్యాన్నీ ఇస్తూ ఉండు గాక."ప్రకృతినీ, పర్యావరణాన్నీ, సమస్త సృష్టినీ గౌరవించడం మన మనుగడకు మూలాధారం. రండి.. వీటి పట్ల మనం పూర్తి కృతజ్ఞతనీ, సేవాభావననీ కలిగి ఉంటూ ఆరోగ్యకర, సౌభాగ్యవంత, శక్తిమంత దేశాన్ని నిర్మించడంలో పాలుపంచుకుందాం.

"శం నో ద్యావాపృథివీ పూర్వహూతౌ శమన్తరిక్షం దృశ్యే నో అస్తు

శం న ఓషధీర్వనినో భవన్తు శం నో రజసస్పతిరస్తు జిష్ణుః" అని పేర్కొన్నారు.

# కొత్త ఇళ్లకు సోక్‌పిట్ తప్పనిసరి

**-ఇంకుడు గుంత లేకుంటే ఇంటి నంబర్, నల్లా కనెక్షన్ లేదు**

**-ప్రతి వార్డులో నెల రోజుల్లో కనీసం 30 ఇంకుడు గుంతల లక్ష్యం**



కరీంనగర్, జులై 31: పట్టణ ప్రాంతాల్లో వర్షపు నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపు కోసం ప్రతి ఇంట్లో ఇంకుడు గుంత (సోక్‌పిట్) ఏర్పాటు తప్పనిసరి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. ఇకపై కొత్తగా నిర్మించే ఇళ్లలో సోక్‌పిట్ లేకుంటే ఇంటి నంబర్‌తో పాటు తాగునీటి నల్లా కనెక్షన్ కూడా మంజూరు చేయబోమని స్పష్టం చేశారు. శుక్రవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) అరుణ శ్రీతో కలిసి మున్సిపల్ కమిషనర్లతో నిర్వహించిన పట్టణ పరిపాలన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు.

జల శక్తి జన భాగిదారి కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటిలో వర్షపు నీటిని ఒడిసిపట్టేలా ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. ఇప్పటికే నిర్మించిన ఇళ్లలో కూడా సాధ్యమైనంత మేర ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసేందుకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని, ప్రతి వార్డులో నెల రోజుల్లో కనీసం 30 సోక్‌పిట్‌లు నిర్మించేలా కార్యాచరణ రూపొందించాలని మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో కూడా తప్పనిసరిగా సోక్‌పిట్‌లు ఏర్పాటు చేసి వర్షపు నీటిని భూగర్భంలోకి ఇంకించే చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే కాలానుగుణ వ్యాధుల నివారణకు పారిశుద్ధ్య కార్యక్రమాలను మరింత పటిష్ఠంగా అమలు చేయాలని, రహదారులపై నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

దోమల వ్యాప్తి నివారణకు ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించడంతో పాటు తాగునీటి నాణ్యతను ఎప్పటికప్పుడు పరీక్షిస్తూ ప్రజలకు సురక్షితమైన తాగునీటిని అందించాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్లు ఆకుల వెంకటేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# భారత వైద్య - సాంకేతిక రంగంలో పెట్టుబడులు - ఆవిష్కరణలు- తయారీకి నవ్యోత్తేజం దిశగా ప్రభుత్వ-పారిశ్రామిక భాగస్వామ్యం

న్యూఢిల్లీ, జులై 31 న్యూఢిల్లీలోని భారత్ మండపంలో ఇవాళ కేంద్ర ప్రభుత్వ పరిధిలోని జాతీయ పెట్టుబడి ప్రోత్సాహక-సౌలభ్య కల్పన సంస్థ 'ఇన్వెస్ట్ ఇండియా', 'ఆసియా పసిఫిక్ మెడికల్ టెక్నాలజీ అసోసియేషన్ (ఏపీఏసీమెడ్) మధ్య ఒక అవగాహన ఒప్పందం కుదిరింది. భారత వైద్య-సాంకేతిక (మెడ్‌టెక్) రంగంలో పెట్టుబడులు- ఆవిష్కరణలు-సుస్థిర వృద్ధిని సాధించే దిశగా కేంద్ర ప్రభుత్వం-అంతర్జాతీయ మెడ్‌టెక్ పరిశ్రమల రంగం మధ్య సహకార బలోపేతమే ఈ ఒప్పందం లక్ష్యం.

ఈ నేపథ్యంలో కేంద్ర రసాయనాలు-ఎరువుల మంత్రిత్వ శాఖ పరిధిలోని ఔషధ విభాగం కార్యదర్శి శ్రీ మనోజ్ జోషి, నీతి ఆయోగ్ సభ్యులు డాక్టర్ ఎం.శ్రీనివాస్ సమక్షంలో సంతకాలు పూర్తయ్యాక ఒప్పందం ప్రతులను సంబంధిత సంస్థల ప్రతినిధులు ఇచ్చిపుచ్చుకున్నారు.

పెట్టుబడుల సౌలభ్య కల్పన, నియంత్రణ, విధానపరమైన భాగస్వామ్యం, పరిశోధన-ఆవిష్కరణ, సాంకేతిక పరిజ్ఞాన బదిలీ, డిజిటల్ ఆరోగ్యం తదితర రంగాల్లో సహకారానికి అనువైన చట్రాన్ని ఈ భాగస్వామ్యం సమకూరుస్తుంది. అలాగే, 'ఏపీఏసీమెడ్' సభ్య కంపెనీలతో భాగస్వామ్యం పెంపొందేలా ప్రోత్సహించడమే కాకుండా భారత్‌లో పెట్టుబడులకు, విస్తరణకు వీలు కల్పిస్తుంది. అలాగే, దేశీయ తయారీ రంగం బలోపేతం కావడంతో పాటు స్థానిక విలువ జోడింపు పుంజుకుంటుంది. తద్వారా వాణిజ్య సౌలభ్యం ఇనుమడిస్తుందని, ప్రపంచ మెడ్‌టెక్ విలువ వ్యవస్థతో భారత్ అనుసంధానం మరింత పెరుగుతుందని అంచనా.

ఒప్పందంపై సంతకాల ప్రక్రియ ముగిశాక "వికసిత భారత్-2047కు ఉత్ప్రేరకంగా మెడ్‌టెక్" అంశంపై శ్రీ మనోజ్ జోషి అధ్యక్షతన 'సీఈఓ'లతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఇందులో సీనియర్ ప్రభుత్వాధికారులు, పరిశ్రమ అగ్రగాములు, కీలక భాగస్వాములు పాల్గొన్నారు. భారత మెడ్‌టెక్ రంగం బలోపేతానికి, ప్రపంచ పోటీతత్వం పెంచేందుకు తగిన వ్యూహాత్మక ప్రాధాన్యాలపై వారు కూలంకషంగా చర్చించారు. స్థానిక వనరుల సేకరణ, సరఫరా వ్యవస్థల బలోపేతం, పరిశోధన-అభివృద్ధి, అంతర్జాతీయ సామర్థ్య వికాస కూడళ్ల (జీసీసీ) పాత్ర, ప్రతిభ-శ్రామిక శక్తి అభివృద్ధి, ప్రపంచ మెడ్‌టెక్ విపణిలో భారత్ భాగస్వామ్యం పెంపు అవకాశాలు సహా కీలక విధాన-నియంత్రణ-పెట్టుబడి ప్రాథమ్యాలపై వారు దృష్టి కేంద్రీకరించారు.

ఈ సందర్భంగా శ్రీ మనోజ్ జోషి మాట్లాడుతూ- "దేశంలో కొన్నేళ్లుగా వైద్య పరికరాల రంగం గణనీయ వృద్ధి సాధించింది. ఆరోగ్య సంరక్షణకు డిమాండ్ పెరుగుదల, ఈ రంగంలో మౌలిక సదుపాయాల విస్తరణ, ఉత్పత్తి సంధానిత ప్రోత్సాహక పథకం (పీఎల్ఐ) అమలు, ఇతరత్రా విధానపరమైన సహాయక చర్యలే ఇందుకు కారణం. ఇలా మనం ముందుకు సాగుతున్న కొద్దీ నాణ్యత, రోగుల భద్రత, ప్రపంచ పోటీతత్వానికి ప్రోత్సాహం, మరింత పటిష్ట-నియంత్రిత వ్యవస్థగా దేశీయ వైద్య పరికరాల రంగం వృద్ధి చెందడం అవసరం" అని స్పష్టం చేశారు.

అలాగే, మెడ్‌టెక్ రంగం భవిష్యత్ ప్రణాళికను వివరిస్తూ- "బలమైన కాంపోనెంట్ తయారీ వ్యవస్థకు రూపమివ్వడం, దేశీయ విలువ జోడింపును ప్రస్తుత 25శాతం నుంచి 40?45 శాతానికి పెంచడం, ముఖ్యంగా ఉన్నత శ్రేణి వైద్య పరికరాలు, ఇమేజింగ్ పరికరాలలో దేశీయ విలువ జోడింపు బలోపేతమే మా లక్ష్యం. విధానపరమైన సహాయక చర్యల ద్వారా ఈ రంగానికి మద్దతిచ్చేందుకు ప్రభుత్వం నిబద్ధతతో ఉంది. మరోవైపు 'పీఎల్ఐ' పథకం తదుపరి దశకు మార్గాన్వేషణ సాగుతోంది. రీఏజెంట్లు-డయాగ్నొస్టిక్స్ ఉత్పత్తుల దేశీయ తయారీకి అధిక పెట్టుబడులను మేం ఆకాంక్షిస్తున్నాం. అదే సమయంలో 'వికసిత భారత్-2047' సంకల్పానికి అనుగుణంగా బలమైన ఎగుమతి సామర్థ్యంతో ప్రపంచవ్యాప్తంగా పోటీపడగల కాంపోనెంట్ పరిశ్రమ వృద్ధిని ప్రోత్సహిస్తున్నాం. ప్రభుత్వం-పరిశ్రమల మధ్య నిరంతర సహకారం ద్వారా పటిష్ట, ఆవిష్కరణాధారిత, ప్రపంచవ్యాప్తంగా పోటీపడే మెడ్‌టెక్ వ్యవస్థను రూపొందించడం మా లక్ష్యం" అని శ్రీ జోషి విశదీకరించారు.

నీతి ఆయోగ్ సభ్యుడు డాక్టర్ ఎం.శ్రీనివాస్ సంయుక్త కృషి గురించి మాట్లాడుతూ- "దేశంలో భవిష్యత్ సంసిద్ధ ఆరోగ్య సంరక్షణ కోసం బలమైన మెడ్‌టెక్ వ్యవస్థను రూపొందించడం అత్యంత కీలకం. ఆరోగ్య సంరక్షణ సేవల బలోపేతం, నాణ్యమైన సంరక్షణ సౌలభ్యం కల్పించడంలో వైద్య నైపుణ్యం, సాంకేతికత, పరిశోధన, డిజిటల్ ఆవిష్కరణల సమ్మేళనం దోహదం చేస్తుంది. ఈ నేపథ్యంలో పరిశోధన-అభివృద్ధిని ప్రోత్సహిస్తూ, ఆధునిక సాంకేతికతల అనుసరణకు మద్దతు ఇవ్వడం ముఖ్యం. అంతేగాక పునరుత్థాన, ప్రపంచ పోటీతత్వ మెడ్‌టెక్ వ్యవస్థను సాకారం చేయడంలో ప్రభుత్వం, పరిశ్రమలు, విద్యాసంస్థలు, ఆవిష్కర్తల మధ్య నిరంతర సహకారం కూడా అత్యంత అవశ్యం" అని స్పష్టం చేశారు.

# భద్రాచలం వద్ద తొలి ప్రమాద హెచ్చరిక జారీ

ఖమ్మం, జులై 31: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాల ప్రభావంతో భద్రాచలం వద్ద గోదావరి ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. నది నీటిమట్టం గంట గంటకూ పెరుగుతుండటంతో శుక్రవారం ఉదయం 10.14 గంటలకు జిల్లా యంత్రాంగం తొలి ప్రమాద హెచ్చరిక జారీ చేసింది. ఉదయం గోదావరి నీటిమట్టం 44 అడుగులకు చేరగా, మధ్యాహ్నం 12 గంటల సమయానికి 44.80 అడుగుల వద్ద నమోదైంది. ప్రస్తుతం సుమారు 10 లక్షల క్యూసెక్కుల వరద నీరు దిగువకు ప్రవహిస్తోంది.

ప్రస్తుత పరిస్థితులను బట్టి శుక్రవారం సాయంత్రానికి నీటిమట్టం 48 అడుగులకు చేరుకుని రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేసే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. వరద ఉద్ధృతి కొనసాగితే నీటిమట్టం 50 అడుగులకు చేరే అవకాశమూ ఉందని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో గోదావరి పరివాహక ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా యంత్రాంగం సూచించింది. ముంపు ముప్పు ఉన్న ప్రాంతాల ప్రజలు ఆలస్యం చేయకుండా సమీపంలోని పునరావాస కేంద్రాలకు తరలివెళ్లాలని అధికారులు విజ్ఞప్తి చేశారు. వరద పరిస్థితిని అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారని, అత్యవసర పరిస్థితులు మినహా ప్రజలు అనవసర ప్రయాణాలు చేయవద్దని సూచించారు.

# రైస్ మిల్లులో విజిలెన్స్ ఆకస్మిక తనిఖీలు



కరీంనగర్, జులై 31:సీఎంఆర్ ధాన్యం నిల్వల్లో అక్రమాలను గుర్తించేందుకు విజిలెన్స్ అధికారులు శుక్రవారం పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ పట్టణ శివారులోని ఓ రైస్ మిల్లులో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. కరీంనగర్ రీజినల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి బస్వారెడ్డి రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన ఈ తనిఖీల్లో మిల్లులో ఉన్న సీఎంఆర్ ధాన-్యం నిల్వలను పరిశీలించారు. పౌరసరఫరాల శాఖ నుంచి మిల్లుకు కేటాయించిన ధాన్యం, దానిని బియ్యంగా మార్చి తిరిగి శాఖకు ఎంత మేరకు అప్పగించారనే అంశాలపై అధికారులు లెక్కలు పరిశీలించారు.

ధాన్యం నిల్వల్లో తేడాలు ఉన్నాయనే అనుమానాల నేపథ్యంలో ప్రభుత్వం ఆదేశాల మేరకు రికార్డులను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. తనిఖీల్లో కరీంనగర్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీఎస్పీ సీతారెడ్డి, ఇన్‌స్పెక్టర్లు అనిల్, ప్రశాంత్, వరుణ్, డిప్యూటీ తహసీల్దార్ దినేష్‌తో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

# అప్రమత్తంగా ఉండండి..

**-భద్రాచలంలో తొలి ప్రమాద హెచ్చరిక జారీ**

**-43 అడుగులకు చేరిన గోదావరి నీటిమట్టం**

ఖమ్మం, జులై 31:భద్రాచలం వద్ద గోదావరి నది నీటిమట్టం 43 అడుగులకు చేరుకోవడంతో తొలి ప్రమాద హెచ్చరిక (ఫస్ట్ వార్నింగ్) జారీ చేసినట్లు జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు. ప్రస్తుతం గోదావరిలో 9,32,288 క్యూసెక్కుల వరద నీరు దిగువకు ప్రవహిస్తోందని పేర్కొన్నారు. గోదావరి పరివాహక ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాల్లో నివసించే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ముంపునకు గురయ్యే ప్రాంతాల ప్రజలను ముందస్తుగా సురక్షిత పునరావాస కేంద్రాలకు తరలించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

జిల్లా యంత్రాంగం వరద పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తోందని, అన్ని శాఖలు సమన్వయంతో ముందస్తు చర్యలు చేపడుతున్నాయని తెలిపారు. ప్రజలు అధికారుల సూచనలను తప్పనిసరిగా పాటించాలని, పుకార్లను నమ్మవద్దని, గోదావరి నది వద్దకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో జిల్లా 24/7 ఫ్లడ్ కంట్రోల్ రూమ్ను సంప్రదించాలని కలెక్టర్ కోరారు. ఫ్లడ్ కంట్రోల్ రూమ్ ఫోన్ నంబర్లు: 08744-241950, 9392919743.

# ఆగస్టు 1 నుంచి 3 వరకు 21వ బోనాల జాతర

**-భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిన దేవస్థానం**

నల్గొండ, జులై 31:యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం దండు మల్కాపురం గ్రామంలోని శ్రీ ఆంథోల్ మైసమ్మ దేవస్థానంలో 21వ బోనాల జాతర ఉత్సవాలు ఆగస్టు 1 నుంచి 3 వరకు అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు దేవస్థానం చైర్మన్ కంచర్ల అశ్విన్‌రెడ్డి, కార్యనిర్వాహణాధికారి ఎన్. మోహన్‌బాబు తెలిపారు. ఉత్సవాలకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని వెల్లడించారు. ఆగస్టు 1న అఖండ దీపారాధన, గణపతి పూజ, పుణ్యాహవాచనం, లలితా సహస్ర నామార్చన, సప్తశతి హోమం, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఆగస్టు 2న భక్తుల బోనాలు, చండీహోమం, అన్నదానం నిర్వహించడంతో పాటు సాయంత్రం శ్రీ ఆంథోల్ మైసమ్మ, శ్రీ ఉప్పలమ్మ, శ్రీ ఎల్లమ్మ అమ్మవార్ల ఉత్సవ విగ్రహాల గ్రామసేవ రథోత్సవం ఘనంగా సాగనుంది. ఆగస్టు 3న గణపతి పూజ, సామూహిక కుంకుమార్చనలు, పూర్ణాహుతి అనంతరం అన్నదానంతో ఉత్సవాలు ముగియనున్నాయి. ఈ వేడుకలకు శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మంత్రులు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, కొండా సురేఖ, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డితో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకానున్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని, ఉత్సవాలను విజయవంతం చేసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు దేవస్థానం ధర్మకర్తల మండలి తెలిపింది.

# భారత వైద్య-సాంకేతిక రంగంలో పెట్టుబడులు-ఆవిష్కరణలు-తయారీకి నవ్యోత్తేజం దిశగా ప్రభుత్వ-పారిశ్రామిక భాగస్వామ్యం

న్యూ ఢిల్లీ, జులై 31:న్యూఢిల్లీలోని భారత్ మండపంలో ఇవాళ కేంద్ర ప్రభుత్వ పరిధిలోని జాతీయ పెట్టుబడి ప్రోత్సాహక-సౌలభ్య కల్పన సంస్థ 'ఇన్వెస్ట్ ఇండియా', 'ఆసియా పసిఫిక్ మెడికల్ టెక్నాలజీ అసోసియేషన్ (ఏపీఏసీమెడ్) మధ్య ఒక అవగాహన ఒప్పందం కుదిరింది. భారత వైద్య-సాంకేతిక (మెడ్‌టెక్) రంగంలో పెట్టుబడులు- ఆవిష్కరణలు-సుస్థిర వృద్ధిని సాధించే దిశగా కేంద్ర ప్రభుత్వం-అంతర్జాతీయ మెడ్‌టెక్ పరిశ్రమల రంగం మధ్య సహకార బలోపేతమే ఈ ఒప్పందం లక్ష్యం. ఈ నేపథ్యంలో కేంద్ర రసాయనాలు-ఎరువుల మంత్రిత్వ శాఖ పరిధిలోని ఔషధ విభాగం కార్యదర్శి శ్రీ మనోజ్ జోషి, నీతి ఆయోగ్ సభ్యులు డాక్టర్ ఎం.శ్రీనివాస్ సమక్షంలో సంతకాలు పూర్తయ్యాక ఒప్పందం ప్రతులను సంబంధిత సంస్థల ప్రతినిధులు ఇచ్చిపుచ్చుకున్నారు.

పెట్టుబడుల సౌలభ్య కల్పన, నియంత్రణ, విధానపరమైన భాగస్వామ్యం, పరిశోధన-ఆవిష్కరణ, సాంకేతిక పరిజ్ఞాన బదిలీ, డిజిటల్ ఆరోగ్యం తదితర రంగాల్లో సహకారానికి అనువైన చట్రాన్ని ఈ భాగస్వామ్యం సమకూరుస్తుంది. అలాగే, 'ఏపీఏసీమెడ్' సభ్య కంపెనీలతో భాగస్వామ్యం పెంపొందేలా ప్రోత్సహించడమే కాకుండా భారత్‌లో పెట్టుబడులకు, విస్తరణకు వీలు కల్పిస్తుంది. అలాగే, దేశీయ తయారీ రంగం బలోపేతం కావడంతో పాటు స్థానిక విలువ జోడింపు పుంజుకుంటుంది. తద్వారా వాణిజ్య సౌలభ్యం ఇనుమడిస్తుందని, ప్రపంచ మెడ్‌టెక్ విలువ వ్యవస్థతో భారత్ అనుసంధానం మరింత పెరుగుతుందని అంచనా.

ఒప్పందంపై సంతకాల ప్రక్రియ ముగిశాక "వికసిత భారత్-2047కు ఉత్ప్రేరకంగా మెడ్‌టెక్" అంశంపై శ్రీ మనోజ్ జోషి అధ్యక్షతన 'సీఈఓ'లతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఇందులో సీనియర్ ప్రభుత్వాధికారులు, పరిశ్రమ అగ్రగాములు, కీలక భాగస్వాములు పాల్గొన్నారు. భారత మెడ్‌టెక్ రంగం బలోపేతానికి, ప్రపంచ పోటీతత్వం పెంచేందుకు తగిన వ్యూహాత్మక ప్రాధాన్యాలపై వారు కూలంకషంగా చర్చించారు. స్థానిక వనరుల సేకరణ, సరఫరా వ్యవస్థల బలోపేతం, పరిశోధన -అభివృద్ధి, అంతర్జాతీయ సామర్థ్య వికాస కూడళ్ల (జీసీసీ) పాత్ర, ప్రతిభ-శ్రామిక శక్తి అభివృద్ధి, ప్రపంచ మెడ్‌టెక్ విపణిలో భారత్ భాగస్వామ్యం పెంపు అవకాశాలు సహా కీలక విధాన- నియంత్రణ-పెట్టుబడి ప్రాథమ్యాలపై వారు దృష్టి కేంద్రీకరించారు.

ఈ సందర్భంగా శ్రీ మనోజ్ జోషి మాట్లాడుతూ- "దేశంలో కొన్నేళ్లుగా వైద్య పరికరాల రంగం గణనీయ వృద్ధి సాధించింది.

# చౌటుప్పల్ ప్రభుత్వాసుపత్రిలో ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి ఆకస్మిక తనిఖీ



నల్గొండ, జులై 31:చౌటుప్పల్ ప్రభుత్వ ఆసుపత్రిని గురువారం రాత్రి మునుగోడు శాసన సభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఆకస్మికంగా సందర్శించారు. రాత్రి వేళ ఆసుపత్రికి వచ్చిన ఎమ్మెల్యే, అక్కడి పరిసరాలను మరియు వివిధ విభాగాల రికార్డులను సమగ్రంగా పరిశీలించారు. అనంతరం ఆస్పత్రి వైద్యులు, సిబ్బందితో పాటు చికిత్స పొందుతున్న పేషంట్లతో స్వయంగా మాట్లాడారు. వారికి అందుతున్న వైద్య సేవలు, ఆసుపత్రిలోని సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. రోగులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా మెరుగైన ఉచిత వైద్య సేవలు అందించాలని వైద్యులకు సూచించారు.

100 పడకల ఆసుపత్రి నిర్మాణంపై సమీక్ష

చౌటుప్పల్ పట్టణంలో కొత్తగా నిర్మిస్తున్న 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి భవన పనులను ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి పరిశీలించారు. భవన నిర్మాణం చివరి దశకు చేరుకున్న నేపథ్యంలో, మిగిలి ఉన్న రోడ్ల నిర్మాణం, పరిసరాల శుభ్రత తదితర పనులను ఏమాత్రం ఆలస్యం చేయకుండా వేగంగా పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఆసుపత్రి త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు అవసరమైన అన్ని చర్యలు తక్షణమే చేపట్టాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ మోగదాల పావని రమేష్ గౌడ్, వైస్ చైర్మన్ గోశిక వినయ్ కుమార్, కౌన్సిలర్లు మహమ్మద్ హన్నూ, దేప రమ్య రాజు, ఉడుగు జ్యోతి రమేష్ లతో పాటు పలువురు స్థానిక నాయకులు, ఆసుపత్రి వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# కొత్తపల్లిలో 'డ్రై డే'

## -నిల్వ నీటిని తొలగించి దోమల నివారణకు చర్యలు
## -డెంగీ, మలేరియా వంటి వ్యాధులపై ప్రజలకు సర్పంచ్ సూచనలు



మహబూబ్‌నగర్, జులై 31: పరిశుభ్రతతోనే ఆరోగ్యకరమైన సమాజం సాధ్యమవుతుందని కొత్తపల్లి గ్రామ సర్పంచ్ ఆర్. నర్సిములు అన్నారు. నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండలంలోని కొత్తపల్లి గ్రామంలో శుక్రవారం 'డ్రై డే?ఫ్రైడే' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, వర్షాకాలంలో ఇళ్ల పరిసరాల్లో మురుగు నీరు, నిల్వ నీరు ఉండటం వల్ల దోమలు, ఈగలు విపరీతంగా పెరిగి డెంగీ, మలేరియా, చికున్‌గున్యా వంటి సీజనల్ వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందన్నారు. నిల్వ నీటిలో లార్వా అభివృద్ధి చెందకుండా ప్రతి కుటుంబం తమ ఇంటి ప్రాంగణం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

కార్యక్రమంలో భాగంగా మంచినీటి బావులు, తొట్టెలు, డ్రమ్ములు తదితర నీటి వనరుల వద్ద క్రిమిసంహారక మందులు పిచికారీ చేసి, పారిశుధ్య చర్యలు చేపట్టారు. ఈ అవగాహన కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శివశంకర్‌తో పాటు గ్రామ ప్రజలు, సిబ్బంది పాల్గొన్నారు.

# శాస్త్రీయ ధ్రువీకరణ, నిపుణులతో విస్తృత సంప్రదింపుల ఆధారంగానే ఈ20 అమలు

న్యూఢిల్లీ, జులై 31నీతి ఆయోగ్, ఆటోమొబైల్ తయారీదారులు, ఆయిల్ మార్కెటింగ్ సంస్థ (ఓఎంసీ)లు, ఆటోమోటివ్ రీసెర్చ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఏఆర్ఏఐ), సొసైటీ ఆఫ్ ఇండియన్ ఆటోమొబైల్ మ్యానుఫాక్చరర్స్ (ఎస్ఐఏఎం), ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం (ఐఐపీ) ఇతర సాంకేతిక సంస్థలతో శాస్త్రీయ ధ్రువీకరణ, సంప్రదింపుల అనంతరం దశల వారీగా ఇథనాల్ మిశ్రమ పెట్రోల్ (ఈబీపీ) కార్యక్రమం అమల్లోకి వచ్చింది.

ఆటోమొబైల్ తయారీ దారులు, ఎస్ఐఏఎం, ఏఆర్ఏఐ, విడిభాగాల తయారీదారులు, టెస్టింగ్ ఏజెన్సీలు, ఆయిల్ మార్కెటింగ్ సంస్థ (ఓఎంసీ)లతో విస్తృత సంప్రదింపులు చేపట్టిన తర్వాతే అధిక ఇథనాల్ మిశ్రమాల విడుదల ప్రారంభమైంది.

ఇంజిన్ మన్నిక, వాహన పనితీరు సామర్థ్యం, స్టార్ట్ అయ్యే సామర్థ్యం, తుప్పు నిరోధకత, మెటీరియల్ అనుకూలత, ఉద్గారాలు, ఇంధన సామర్థ్యం లాంటి పరిమితులపై విస్తృత ప్రయోగశాల అధ్యయనాలను, క్షేత్రస్థాయి పరీక్షలను ఏఆర్ఏఐ, ఎస్ఐఏఎం, ఐవోసీఎల్, ఐఐపీ, ఆటోమొబైల్ తయారీదారులు చేపట్టారు. నిర్దేశిత ప్రమాణాల ప్రకారం ఈ20 వినియో గించడానికి సురక్షితమైనదని ఈ అధ్యయనాలు నిర్ధారించాయి.

ఈ20 కారణంగా పాత వాహనాల పనితీరులో ఎలాంటి గణనీయమైన మార్పు, అసాధారణ రీతిలో అరుగుదల కనిపించలేదని కూడా ఈ అధ్యయనాలు నిరూపించాయి. ఈ విస్తృతమైన ప్రయోగశాల అధ్యయనాలు, క్షేత్రస్థాయి ధ్రువీకరణ, వాస్తవ వినియోగ అనుభవం ద్వారా ఈ20 ఇంధనం వల్ల వాహన పనితీరుపై ఎలాంటి ప్రతికూల ప్రభావం ఉన్నట్టు నిరూపణ కాలేదు.

కేవలం ప్రయోగశాల పరిశోధనపై మాత్రమే కాకుండా, జాతీయ స్థాయిలో అమల్లోకి తీసుకు వచ్చిన అనంతరం విస్తృత స్థాయిలో ఎదురైన అనుభవం పైన కూడా ప్రభుత్వ అంచనా ఆధారపడింది. భారత్‌లో ప్రతి రోజూ సుమారు 8 కోట్ల వాహనాలు రీటైల్ అవుట్‌లెట్లకు వెళుతున్నాయి (వీటిలో 80 శాతం పెట్రోల్ వాహనాలున్నాయి).

ఈ15+ మిశ్రమ పెట్రోల్ మూడున్నరేళ్లకు పైగా, ఈ19-ఈ20 ఇంధనం రెండున్నరేళ్లకు పైగా విస్తృత వినియోగంలో ఉండటమే దీనికి నిదర్శనం. 20 కోట్లకు పైగా ద్విచక్ర వాహనాలు, మూడు కోట్లకు పైగా పెట్రోలు కార్లు ఈ మిశ్రమాలతోనే నడుస్తున్నాయి. ఇథనాల్ మిశ్రమం కారణంగా ఇంజిన్ వైఫల్యాలు లేదా బ్రేక్‌డౌన్లు జరిగినట్లు ఎలాంటి ఆధారాలు లేవు. ఈ20 ఇంధనం వల్ల అసాధారణ తుప్పు, అరుగుదల లేదా వాహన జీవిత కాలం తగ్గిపోవడం లాంటివి జరగలేదని తయారీదారుల సర్వీస్ డేటా స్పష్టం చేస్తోంది.

ఈ20 వాహనాలకు వారంటీలను తయారీదారులు అందిస్తున్నారు. ఇది ఈ20 ఇంధనం అందిచే భద్రత, విశ్వసనీయతపై నమ్మ కాన్ని మరింత పెంచుతోంది.

2025-26 ఆర్థిక సంవత్సరంలో ప్రముఖ ఓఈఎం సంస్థ 2.84 కోట్లకు పైగా వాహనాలకు సర్వీసింగ్ చేసింది. వాటిలో ఈ20కి అనుకూలమైనవి అని ధ్రువీకరించని వాహనాలు సుమారుగా 1.5 కోట్లు ఉన్నాయి. వీటిలో ఈ20 కారణంగా తుప్పు, అసాధారణ రీతిలో అరుగుదల లేదా విడిభాగాల జీవితకాలం తగ్గడం లాంటివి ఏమీ కనిపించలేదని ఆ సంస్థ నివేదించింది. మరో ప్రముఖ ద్విచక్ర వాహన సంస్థ కూడా ఇదే తరహా క్షేత్రస్థాయి అనుభవాన్ని తెలియజేసింది. నిర్దేశిత కాలం పాటు 1.4 కోట్ల ఈ20 ఆధారిత వాహనాలను ఒక ఓఈఎం పర్యవేక్షించింది. ఈ సంస్థ ఇథనాల్ వల్ల తుప్పు ఏర్పడుతుందనే దానికి ఎలాంటి ఆధారాలు కనిపించలేదని పేర్కొంది. వినియోగదారుల వద్దకు చేరుకొనే ముందే వాహనాలు కఠినమైన అంతర్జాతీయ ప్రమాణాల ధ్రువీకరణను పొందుతాయని ఏఆర్ఏఐ తెలియజేసింది.

ప్రతి దశలోనూ శాస్త్రీయ మూల్యాంకనం, దశల వారీగా ప్రవేశ పెట్టడంలో ఆటోమొబైల్ తయారీదారులు, విడిభాగాల సరఫరాదారులు, ఎస్ఐఏఎం, ఏఆర్ఏఐ, టెస్టింగ్ ఏజెన్సీలు, చమురు మార్కెటింగ్ సంస్థలు పాల్గొన్నాయి. ఇంధన వ్యవస్థలు, ఇంజిన్ మన్నిక, వాహన పనితీరు సామర్థ్యం, మెటీరియల్ అనుకూలత, ఉద్గారాల పనితీరును విజయవంతంగా ధ్రువీకరించిన తర్వాతే ఈ20ను ప్రవేశపెట్టారు.

# పీఏసీఎస్ నూతన చైర్మన్ ఉపేందర్ రెడ్డికి ఘన సన్మానం

నల్గొండ, జులై 31:యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పీఏసీఎస్ నూతన చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన జనగాం ఉపేందర్ రెడ్డిని మార్కెట్ పాలకవర్గం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. పూల మాలలు, శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

మార్కెట్ కమిటీలో పీఏసీఎస్ తరఫున పాలకవర్గ సభ్యునిగా ఉపేందర్ రెడ్డి కొనసాగనున్న నేపథ్యంలో మార్కెట్ చైర్మన్ అయినాల చైతన్య మహేందర్ రెడ్డి, డైరెక్టర్లు, మార్కెట్ కార్యదర్శి, సిబ్బంది ఆయనకు ఘన స్వాగతం పలికి అభినందనలు తెలిపారు.

# సీడీఎంఏ ఆధ్వర్యంలో మున్సిపల్ అధికారులకు ప్రత్యేక శిక్షణ

నిజామాబాద్, జులై 31: పట్టణ స్థానిక సంస్థల పనితీరును మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దడంతో పాటు ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలనే లక్ష్యంతో సీడీఎంఏ ఆధ్వర్యంలో ఎన్ఐయూఎం, ఈఎస్సీఐ సంయుక్తంగా నిర్వహిస్తున్న మూడో బ్యాచ్ శిక్షణ కార్యక్రమం హైదరాబాద్‌లో కొనసాగుతోంది. ఈ కార్యక్రమంలో భీమ్‌గల్ మున్సిపాలిటీకి చెందిన అధికారులు కూడా పాల్గొంటున్నారు. శిక్షణలో భాగంగా నాయకత్వ వికాసం, మున్సిపల్ పాలన, పట్టణాభివృద్ధి, ప్రభుత్వ సంక్షేమ పథకాల సమర్థ అమలు, టౌన్ ప్లానింగ్, పారిశుద్ధ్య నిర్వహణ, ఆర్థిక నిర్వహణ, డిజిటల్ సేవల వినియోగం తదితర అంశాలపై సీనియర్ అధికారులు, నిపుణులు సమగ్ర అవగాహన కల్పిస్తున్నారు.

పట్టణాభివృద్ధిలో నూతన విధానాలు, పారదర్శక పాలన, ప్రజా భాగస్వామ్యంతో అభివృద్ధి కార్యక్రమాల అమలు, పట్టణ మౌలిక సదుపాయాల కల్పనపై కూడా ప్రత్యేక సదస్సులు నిర్వహిస్తున్నారు. ఈ శిక్షణ ద్వారా అధికారులు తమ విధుల్లో మరింత నైపుణ్యాన్ని పెంపొందించుకుని పట్టణ ప్రజలకు వేగవంతమైన, నాణ్యమైన సేవలు అందించే సామర్థ్యాన్ని పెంచుకుంటారని నిర్వాహకులు తెలిపారు.

# 18ఏళ్ల భూసమస్యకు పరిష్కారం..

కర్నూలు జులై 31: ఒక్క నెలఒక నియోజకవర్గం నాలుగు పర్యటనలు కార్యక్రమంలో భాగంగా గోనెగండ్ల మండల కేంద్రంలోని బాషా ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో బైలుప్పల గ్రామానికి చెందిన దాసరి జాంబయ్యకు సంబంధించిన 18ఏళ్ల భూ సమస్యకు పరిష్కారం లభించింది.

బైలుప్పల గ్రామం, సర్వే నంబర్ 403లోని 2.70 ఎకరాల వారసత్వ భూమి గత 18సంవత్సరాలుగా పొరపాటున ఇనాం భూమిగా నమోదై ఉండటంతో జాంబయ్య ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనిపై స్పందించి జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, రెవెన్యూ అధికారులు రికార్డులను సరిచేసి సమస్యను పరిష్కరించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే జయ నాగేశ్వర రెడ్డి చేతుల మీదుగా రైతు జాంబయ్యకు ఆన్‌లైన్ అడంగల్ అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి, జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా దాసరి జాంబయ్య మాట్లాడుతూ.. 18 సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న తన భూ సమస్యను పరిష్కరించిన రాష్ట్ర ప్రభుత్వానికి, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి, ఎమ్మెల్యే డాక్టర్ బి.వి. జయ నాగేశ్వర రెడ్డి, జాయింట్ కలెక్టర్, రెవెన్యూ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

# ఆలయ చందాల వివాదం..

మెదక్, జులై 31:మండలంలోని ఓ గ్రామంలో పోచమ్మ తల్లి ఆలయ చందాల వ్యవహారం వివాదానికి దారితీసింది. ఆలయానికి సేకరించిన చందాల లెక్కలను గ్రామ ప్రజలకు వెల్లడించాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు. చందాల వినియోగంపై స్పష్టత లేకపోవడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

నిరసనగా గ్రామస్థులు గ్రామ పంచాయతీ కార్యాలయానికి తాళం వేసి ఆందోళన చేపట్టారు. దీంతో కొంతసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. విషయం తెలుసుకున్న గ్రామ పెద్దలు, స్థానిక నాయకులు జోక్యం చేసుకుని ఇరు వర్గాలతో చర్చించడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది. ఆలయ చందాల ఆదాయం, వ్యయానికి సంబంధించిన పూర్తి వివరాలను గ్రామ ప్రజల ముందుంచి పారదర్శకత పాటించాలని గ్రామస్థులు మరోసారి డిమాండ్ చేశారు.

# కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరువ చేయాలి

న్యూఢిల్లీ, జులై 31కేంద్ర ప్రభుత్వ పథకాలను మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని పత్రికా సమాచార కార్యాలయం (పీఐబీ) అడిషనల్ డైరెక్టర్ జనరల్ శ్రీమతి శృతి పాటిల్ పేర్కొన్నారు. గత 12 ఏళ్లలో కేంద్ర ప్రభుత్వం సాధించిన విజయాలపై గురువారం కవాడిగూడలోని సీజీవో టవర్స్‌లో పీఐబీ 'వార్త' వర్క్‌షాప్ నిర్వహించింది. ఈ కార్యక్రమానికి ఇంటర్ మీడియా పబ్లిసిటీ కోఆర్డినేషన్ కమిటీ(ఐఎంపీసీసీ)లో భాగంగా ఉన్న వివిధ కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వ శాఖలు, విభాగాలు, ప్రభుత్వ రంగ సంస్థలు(పీ ఎస్ యూ)లకు చెందిన ఉన్నతాధికారులు హాజరయ్యారు. తమ శాఖల పరిధిలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను, గత 12 సంవత్సరాల్లో సాధించిన ముఖ్య విజయాలను వివరించారు.

# నాసిరకం పనులతో నేలకూలిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్



మహబూబ్‌నగర్, జులై 31:విద్యుత్ పనుల్లో నాణ్యత లోపించడంతో ట్రాన్స్‌ఫార్మర్ కట్టలు కూలిపోతున్నాయని మక్తల్ పట్టణ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మక్తల్ పట్టణంలోని 9వ వార్డులో రెండు నెలల క్రితం ఏర్పాటు చేసిన 11 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ బుధవారం రాత్రి కురిసిన వర్షానికి నేలకూలింది. ట్రాన్స్‌ఫార్మర్‌తో పాటు కట్ట కూడా కూలిపోవడంతో విద్యుత్ కనెక్షన్లు తెగిపోయాయి.

దీంతో రాఘవేంద్ర కాలనీ, శబరి కాలనీ, బాబు జగ్జీవన్ రామ్ కాలనీ, ఎల్లమ్మకుంట తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

ఏడాది క్రితం నిర్మించిన ట్రాన్స్‌ఫార్మర్ కట్ట పటిష్టంగా ఉండగా, రెండు నెలల క్రితం నిర్మించిన కొత్త కట్ట నాసిరకం పనుల కారణంగానే కూలిపోయిందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

మక్తల్ పట్టణంలో విద్యుత్ పనుల కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో ప్రజలు, రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. రైతులు అగ్రికల్చర్ డీడీలు చెల్లించి నెలలు గడుస్తున్నా ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాలు అందడం లేదని వాపోతున్నారు.

పట్టణంలోని బసవేశ్వర కాలనీలో నిర్మించిన కొత్త ట్రాన్స్‌ఫార్మర్ కట్ట కొద్ది రోజుల్లోనే దెబ్బతిని కూలిపోయిందని, షార్ట్ సర్క్యూట్ కారణంగా విద్యుత్ సరఫరా నిలిచిపోయిందని తెలిపారు.

నూతన ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలో నిర్మించిన ట్రాన్స్‌ఫార్మర్ కట్టకు ఇప్పటికే పగుళ్లు వచ్చాయని, మరోసారి వర్షాలు కురిస్తే ప్రమాదం జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వినాయక్ నగర్‌లోని చక్కెర హనుమప్ప గుడి వెనుక భాగంలో నిర్మించిన ట్రాన్స్‌ఫార్మర్ కట్టకు కనెక్షన్ ఇవ్వకముందే పగుళ్లు ఏర్పడటంపై ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నాసిరకంగా నిర్మించిన ట్రాన్స్‌ఫార్మర్ కట్టలను తొలగించి, నాణ్యమైన సామగ్రితో పునర్నిర్మించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. అలాగే రైతుల పెండింగ్ విద్యుత్ పనులను వెంటనే పూర్తి చేయాలని కోరుతున్నారు.

విద్యుత్ పనులపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నాయకులు శివారెడ్డి, బీజేపీ నాయకులు బ్యాటరి రాజు వేర్వేరు ప్రకటనల్లో డిమాండ్ చేశారు.

# వర్షాల ధాటికి దెబ్బతిన్న ఇళ్లు.. డబుల్ బెడ్రూమ్ ఇళ్లకు బాధితుల తరలింపు

నిజామాబాద్, జులై 31:గత రెండు రోజులుగా కురుస్తున్న ఎడతెరిపి లేని వర్షాలకు నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలం రాణాకలాన్ గ్రామంలో పలు ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. గ్రామానికి చెందిన షేక్ వహీదా, మెట్టు సుజాత, ఉచిర్ల లలితల ఇళ్లు దెబ్బతినడంతో గ్రామ పంచాయతీ పాలకవర్గం వెంటనే సహాయక చర్యలు చేపట్టింది. ప్రమాదాన్ని ముందుగానే గుర్తించిన అధికారులు, గతంలో మంజూరైన డబుల్ బెడ్రూమ్ ఇళ్లలో బాధితులను సురక్షితంగా తరలించడంతో ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా ప్రమాదం తప్పింది.

అదే సమయంలో గ్రామంలో ఒంటరిగా నివసిస్తున్న చెవుల గౌరవ్వ అనే వృద్ధురాలిని కూడా భద్రత దృష్ట్యా ఆమె కుమారుడి ఇంటికి తరలించారు. వర్షాల నేపథ్యంలో గ్రామ పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన సహాయక చర్యలు చేపడుతున్నట్లు స్థానిక ప్రజాప్రతినిధులు తెలిపారు. సమయస్ఫూర్తితో స్పందించి బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించిన గ్రామ పంచాయతీ పాలకవర్గ ప్రతినిధులను గ్రామస్తులు అభినందించారు. కార్యక్రమంలో సర్పంచ్ అలేఖ్య శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి రంజిత్, ఉపసర్పంచ్ రవి, గ్రామ నాయకులు దేవేందర్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

# దక్షిణ మధ్య రైల్వేలోని వాడి - రాయచూర్ సెక్షన్‌లో రూ.220 కోట్ల విద్యుత్ మార్గం ఆధునికీకరణ ప్రాజెక్టుకు భారతీయ రైల్వే ఆమోదం

న్యూఢిల్లీ, జులై 31రైల్వే మౌలిక సదుపాయాల బలోపేతం, అధిక రద్దీ కలిగిన మార్గాల్లో సామర్థ్యాన్ని పెంచే దిశగా దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని వాడి - రాయచూర్ సెక్షన్‌లో విద్యుత్ ట్రాక్షన్ వ్యవస్థను 125 కేవీ నుంచి 225 కేవీకి ఆధునీకరించేందుకు రూ. 220 కోట్ల ప్రాజెక్టుకు భారతీయ రైల్వే ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్ట్ 102 రూట్ కిలోమీటర్ల (204 ట్రాక్ కిలోమీటర్ల) డబుల్ లైన్ సెక్షన్‌ను కవర్ చేస్తుంది. కీలకమైన రైలు కారిడార్లలో విద్యుత్ ట్రాక్షన్ మౌలిక సదుపాయాలను ఆధునీకరించడానికి భారతీయ రైల్వేలు చేపడుతున్న నిరంతర ప్రయత్నాలలో ఇది ఒక భాగం.

అప్‌గ్రేడ్ చేయనున్న ఈ ట్రాక్షన్ వ్యవస్థ రైల్వే ట్రాక్షన్ మౌలిక సదుపాయాలను మరింత బలోపేతం చేయడంతో పాటు, రైల్వే నెట్‌వర్క్‌లోని కీలక మార్గాల్లో ఒకటైన ఈ విభాగంలో పెరుగుతున్న రైలు రాకపోకల అవసరాలను సమర్థంగా తీర్చేందుకు తోడ్పడుతుంది. వాడి - రాయచూర్ సెక్షన్ ముంబై - పుణె - వాడి - రాయచూర్ - గుంతకల్ - కడప - రేణిగుంట ?చెన్నైలను అనుసంధానించే (హై డెన్సిటీ నెట్‌వర్క్ - హెచ్డీఎన్) రూట్?7లో భాగంగా ఉంది.

225 కేవీ విద్యుత్ ట్రాక్షన్ వ్యవస్థను అమలు చేయడం ద్వారా ప్రస్తుతం ఉన్న విద్యుత్ ట్రాక్షన్ మౌలిక సదుపాయాలు మరింత బలోపేతం అవుతాయి. ఈ మార్గంలో రోజురోజుకూ పెరుగుతున్న ప్రయాణికులు, సరుకు రవాణా రైళ్ల రాకపోకలను సమర్థవంతంగా నిర్వహించే సామర్థ్యం కూడా పెరుగుతుంది. ఈ ఆధునికీకరణతో నిర్వహణ సామర్థ్యం మెరుగుపడటంతో పాటు, వ్యూహాత్మకంగా అత్యంత కీలకమైన ఈ రైల్వే కారిడార్‌లో రైళ్లను మరింత విశ్వసనీయంగా, అంతరాయం లేకుండా నడిపేందుకు దోహదపడుతుంది.

దేశవ్యాప్తంగా అధిక రద్దీ కలిగిన రైల్వే మార్గాల్లో సామర్థ్యాన్ని పెంపొందిస్తూ, కీలక మౌలిక సదుపాయాలను ఆధునీకరించేందుకు భారతీయ రైల్వే చేపడుతున్న నిరంతర ప్రయత్నాలలో భాగంగా ఈ ప్రాజెక్టు చేపడుతున్నారు. ఈ ప్రాజెక్టు ఆమోదం ద్వారా కీలక రైల్వే మౌలిక సదుపాయాల అభివృద్ధి, నిర్వహణ సామర్థ్యాల పెంపు, ప్రయాణికుల, సరుకు రవాణా వినియోగదారుల అవసరాలను తీర్చగల ఆధునిక, విశ్వసనీయ, భవిష్యత్ అవసరాలకు సిద్ధంగా ఉండే రైల్వే నెట్‌వర్క్ నిర్మాణం పట్ల భారతీయ రైల్వే నిబద్ధత మరోసారి స్పష్టమైంది.

# పార్లమెంటు ప్రశ్న: యూపీఎస్సీ, ఎస్ఎస్సీలో సంస్కరణలు

న్యూ ఢిల్లీ, జులై 31:ప్రభుత్వ ఉద్యోగ నియమకాల ప్రక్రియను మరింత వేగవంతంగా, పారదర్శకంగా, సమర్థవంతంగా మార్చేందుకు సిబ్బంది, శిక్షణ విభాగం (డీఓపీటీ) అనేక సంస్కరణలు చేపట్టింది. పరీక్షల విశ్వసనీయతను, పారదర్శకతను పెంచడమే వీటి ప్రధాన లక్ష్యం. నియమకాలను వేగవంతం చేయడానికి, నిష్పాక్షికతను నిర్ధారించడానికి గ్రూప్ 'సి', గ్రూప్ 'బీ ' (నాన్ గెజిటెడ్) పోస్టులకు ఇంటర్వ్యూ విధానాన్ని 2016 జనవరి 1వ తేదీ నుంచి పూర్తిగా రద్దు చేశారు. అభ్యర్థుల స్వయం ధ్రువీకరణ ఆధారంగానే తాత్కాలిక నియామక పత్రాలను జారీ చేస్తున్నారు. కుల, ప్రవర్తనా ధ్రువీకరణ పత్రాల పరిశీలనకు ఆరు నెలల గడువు కేటాయించారు. ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీని అన్ని మంత్రిత్వ శాఖలు, ప్రభుత్వ సంస్థలు సమయ పరిమితితో కూడిన మిషన్ మోడ్ పద్ధతిలో చేపట్టాయి. 2022 అక్టోబర్ నుంచి ప్రభుత్వం ప్రారంభించిన జాతీయ రోజ్‌గార్ మేళాల ద్వారా లక్షలాది నియామక పత్రాలను పంపిణీ చేశారు.

శిక్షణ విభాగం పరిపాలన పరిధిలో యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ), స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (ఎస్ఎస్సీ) అనే రెండు ప్రధాన నియామక సంస్థలు పనిచేస్తున్నాయి. వీటిలో ఎస్ఎస్సీ పరీక్షల భద్రత, పారదర్శకతను పెంచేందుకు సమగ్రమైన సాంకేతిక, పరిపాలన సంస్కరణలను అమలు చేసింది. కంప్యూటర్ ఆధారిత పరీక్షలు , తక్కువ పరీక్షా దశలను అమలు చేయడం ద్వారా గతంలో 15 నుంచి 18 నెలలు పట్టే నియామక ప్రక్రియను 6 నుంచి 8 నెలలకు తగ్గించారు. పత్రాల సమాచారాన్ని ట్యాంపర్-ప్రూఫ్, వేగవంతమైన, సురక్షితమైన డిజిటల్ డాక్యుమెంట్ కవర్యాని కేషన్ కోసం'ఈ-డాసియర్' వ్యవస్థను ప్రారంభించారు. ప్రతిభ ఆధారంగా ఖాళీలను గరిష్టంగా భర్తీ చేసేందుకు, పోస్టుల అప్‌గ్రేడేషన్ కోసం స్లైడింగ్ విధానాన్ని అందుబాటులోకి తెచ్చారు. తాత్కాలిక, తుది జవాబు కీలను ప్రచురించడం, అభ్యర్థుల అభ్యంతరాలను ఆహ్వానించడం, అభ్యంతరాల రుసుమును తగ్గించడం, మార్కులు, ఫలితాలను ఆన్‌లైన్‌లో విడుదల చేయడం ద్వారా పారదర్శకతను పెంచారు.

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) పలు కీలక సంస్కరణలను అమలులోకి తెచ్చింది. దీనివల్ల గతంలో 15 నెలలకు పైగా పట్టే నియామక ప్రక్రియ సమయం ప్రస్తుతం దాదాపు 13 నెలలకు తగ్గింది. దరఖాస్తు ప్రక్రియను సులభతరం చేసేందుకు ఆన్‌లైన్ మాడ్యులర్ దరఖాస్తు వేదికను అందుబాటులోకి తెచ్చారు. సివిల్ సర్వీసెస్ పరీక్ష యత్నాలను ఖచ్చితంగా తనిఖీ చేయడానికి కృత్రిమ మేధ సాంకేతికతను ఉపయోగిస్తున్నారు. ఇతరులతో పరీక్ష రాయించే మాల్ ప్రాక్టీస్‌ను నిరోధించడానికి ముఖ గుర్తింపు విధానాన్ని ప్రవేశపెట్టారు. పారదర్శకమైన అభ్యంతరాల స్వీకరణ విధానంతో కూడిన తాత్కాలిక జవాబు కీలను విడుదల చేస్తున్నారు. అభ్యర్థుల సందేహాల నివృత్తికి ప్రత్యేక సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. పరీక్షా కేంద్రాలను మరిన్ని ప్రాంతాలకు విస్తరించడంతో పాటు దివ్యాంగులకు తమకు కావలసిన పరీక్షా కేంద్రాన్ని ఎంచుకునే సౌకర్యాన్ని కల్పించారు.

# మూజువాణి ఓటుతో 'పబ్లిక్ పరీక్షల సవరణ బిల్లు- 2026'ను ఆమోదించిన రాజ్యసభ

న్యూఢిల్లీ, జులై 31లోక్‌సభ ఇదివరకే ఆమోదించిన 'పబ్లిక్ పరీక్షల (అక్రమాల నివారణ) సవరణ బిల్లు- 2026'ను రాజ్యసభ ఈ రోజు మూజువాణి ఓటుతో ఆమోదించింది. ఈ బిల్లుపై జరిగిన చర్చలో కేంద్ర శాస్త్ర-సాంకేతిక మంత్రిత్వ శాఖ, భూవిజ్ఞాన శాఖల సహాయ మంత్రి (స్వతంత్ర హోదా).. ప్రధాని కార్యాలయం, సిబ్బంది-ప్రజా ఫిర్యాదులు-పింఛన్లు, అణుశక్తి-అంతరిక్ష శాఖల సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ మాట్లాడుతూ.. ఈ సవరణలు విద్యార్థులు, యువత ప్రయోజనాలను రక్షిస్తూనే పబ్లిక్ పరీక్షల్లో అక్రమాలను నిరోధించడానికి చట్టపరమైన వ్యవస్థను మరింత బలోపేతం చేస్తాయని తెలిపారు.

పబ్లిక్ పరీక్షలు పారదర్శకంగా, నమ్మదగినవిగా, ప్రతిభకు పట్టం కట్టేలా నిర్వహించడం ద్వారా విద్యార్థుల నిజాయితీ కష్టానికి తగిన రక్షణ కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి తెలిపారు. ఈ చట్టం కేవలం ప్రశ్నపత్రాల లీకేజీలకే పరిమితం కాలేదని స్పష్టం చేసిన ఆయన... పబ్లిక్ పరీక్షల్లో జరిగే అన్ని రకాల అక్రమాలను అరికట్టడమే ఈ బిల్లు ముఖ్య ఉద్దేశమని అన్నారు. ప్రశ్నపత్రాలు, సమాధాన పత్రాల లీకేజీలు, జవాబు పత్రాలు లేదా కంప్యూటర్ వ్యవస్థల ట్యాంపరింగ్, పరీక్ష ప్రక్రియలను మార్చడం, నకిలీ వెబ్‌సైట్లు, హాల్ టిక్కెట్లను సృష్టించడం నుంచి పరీక్షల్లో అక్రమాలకు పాల్పడేందుకు చేసే వ్యవస్థీకృత ప్రయత్నాల వరకు ఈ చట్టం అన్ని నేరాలను సమగ్రంగా అరికడుతుందని చెప్పారు. పరీక్షలకు సంబంధించిన వివిధ రకాల మాల్ ప్రాక్టీసులను అరికట్టడంలో ఈ చట్టానికి ఉన్న సమగ్ర స్వరూపాన్ని ఈ నిబంధనలు తెలియజేస్తున్నాయని ఆయన తెలిపారు.

ఈ చట్టాన్ని మరింత బలోపేతం చేసేందుకు సభ్యుల నుంచి వచ్చే నిర్మాణాత్మక సూచనలను ఆహ్వానించిన ప్రభుత్వం... ఎంతో వినయం, స్వచ్ఛమైన మనస్సుతో ఈ సవరణ బిల్లును సభ ముందుకు తీసుకొచ్చిందని డాక్టర్ జితేంద్ర సింగ్ తెలిపారు. పబ్లిక్ పరీక్షల్లో అక్రమాలు దేశంలోని ప్రతి తల్లిదండ్రులనూ, ప్రతి కుటుంబాన్నీ, ప్రతి పౌరుడినీ తాకే అంశమని... ఇది విద్యార్థుల ఆకాంక్షలతో పాటు దేశ భవిష్యత్తు మానవ వనరులపై కూడా నేరుగా ప్రభావం చూపుతుందని ఆయన అన్నారు.

విద్యా వ్యవస్థను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం చేస్తున్న కృషిని డాక్టర్ జితేంద్ర సింగ్ వివరించారు. జాతీయ విద్యా విధానం-2020 విద్యార్థులకు మరింత అకడమిక్ సౌలభ్యాన్ని, విస్తృత అవకాశాలను కల్పిస్తూ విప్లవాత్మక సంస్కరణలను తీసుకువచ్చిందని తెలిపారు. దేశంలోని విశ్వవిద్యాలయాల సంఖ్య 760 నుంచి 1,293కి పెరగ్గా, ఉన్నత విద్యా సంస్థలు 51,534 నుంచి 64,896కి పెరిగాయని ఆయన సభకు సమాచారం అందించారు.

వైద్య విద్యలో చేపట్టిన సంస్కరణలను ప్రస్తావిస్తూ... ఎయిమ్స్ సంస్థల సంఖ్య 7 నుంచి 22కి, మెడికల్ కాలేజీలు 387 నుంచి 844కి, అండర్ గ్రాడ్యుయేట్ (యూజీ) మెడికల్ సీట్లు 51,300 నుంచి 1.39 లక్షలకు, పోస్ట్ గ్రాడ్యుయేట్ (పీజీ) మెడికల్ సీట్లు 31,000 నుంచి 86,300కి పెరిగాయని.. దీనివల్ల నాణ్యమైన వైద్య విద్య సాధారణ ప్రజలకు మరింత అందుబాటులోకి, తక్కువ ధరలోకి మారిందని మంత్రి పేర్కొన్నారు.

విద్యా అవకాశాలు, ఉపాధి కల్పనను విస్తరించడానికి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలను కూడా డాక్టర్ జితేంద్ర సింగ్ ప్రస్తావించారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 400 ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలు అందుబాటులోకి వచ్చాయని ఆయన తెలిపారు. ఉపాధి కల్పన గురించి మాట్లాడుతూ, ప్రభుత్వ నియమకాలు 2004?2014 మధ్యకాలంలో 7.22 లక్షలుగా ఉంటే, 2014?2024 నాటికి అవి 10.96 లక్షలకు పెరిగాయని చెప్పారు. బ్యాక్‌లాగ్ ఖాళీల భర్తీ ప్రక్రియను పూర్తి చేయడంతో పాటు, ప్రభుత్వ సర్వీసుల్లో పదోన్నతుల పురోగతిని మెరుగుపరచడానికి ప్రత్యేక ప్రమోషన్ డ్రైవ్‌లను చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు.

యువతలో పారిశ్రామికవేత్తల భావనను పెంపొందించడానికి 'స్టార్టప్ ఇండియా' చొరవ ద్వారా ప్రభుత్వం ఎంతో ప్రోత్సహించిందని కేంద్ర మంత్రి తెలిపారు. ఈ పథకం ప్రారంభించిన సమయంలో దాదాపు 350?400గా ఉన్న స్టార్టప్‌ల సంఖ్య ఈనాడు దాదాపు 2.4 లక్షలకు పెరిగిందని, దీనితో భారత్ ప్రపంచంలోనే మూడవ అతిపెద్ద స్టార్టప్ వ్యవస్థగా నిలిచిందని ఆయన వెల్లడించారు. నూతన ఆవిష్కరణలు, పరిశోధనలు, మేధో సంపత్తి సృష్టిలో గణనీయమైన ప్రగతి నమోదైందని, భారత్ ఇప్పుడు పీహెచ్‌డీ అవుట్‌పుట్ పేటెంట్ ఫైలింగ్స్‌లో ప్రపంచంలోనే అగ్రగామి దేశాల సరసన నిలిచిందని ఆయన పేర్కొన్నారు.

పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) యాక్ట్, 2024 పరిధిలోకి యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్, స్టాఫ్ సెలక్షన్ కమిషన్, రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డులు, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్యాంకింగ్ పర్సనల్ సెలక్షన్, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ తో సహా ప్రధాన నియామక సంస్థలు నిర్వహించే పరీక్షలు వస్తాయని డాక్టర్ జితేంద్ర సింగ్ తెలిపారు. పరీక్షల నిర్వహణ వ్యవస్థలో ఇప్పటికే ప్రవేశపెట్టిన సంస్కరణలను ప్రస్తావిస్తూ, కొన్ని నిర్దిష్ట ప్రభుత్వ ఉద్యోగాల నియామకాలకు ఇంటర్వ్యూలను రద్దు చేసినట్లు, ఆన్‌లైన్ దరఖాస్తు విధానాన్నీ, అభ్యర్థులకు సులువైన పరీక్ష ప్రక్రియలనూ అందుబాటులోకి తెచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. ప్రాథమిక జవాబు 'కీ'లను (ప్రొవిజనల్ ఆన్సర్ కీస్) విడుదల చేయడం ద్వారా పారదర్శకత పెరిగిందని, సైబర్ భద్రతా చర్యలను మరింత బలోపేతం చేసినట్లు ఆయన వెల్లడించారు. స్టాఫ్ సెలెక్షన్ కమిషన్ (ఎస్‌ఎస్‌సీ)లో నియామక ప్రక్రియ సగటు వ్యవధిని గతంలో ఉన్న తొమ్మిది నెలల ఎనిమిది రోజుల నుంచి ఎనిమిది నెలల 24 రోజులకు తగ్గించినట్లు ఆయన తెలిపారు. 'ప్రతిభా సేతు' కార్యక్రమాన్ని ప్రస్తావిస్తూ, ప్రతిభావంతులైన సివిల్ సర్వీసెస్ అభ్యర్థులను భావి ఉద్యోగ కల్పన సంస్థలతో అనుసంధానించేందుకు ఈ పోర్టల్‌ను రూపొందించామని, ఇప్పటికే 335 ప్రైవేట్ కంపెనీలు ఈ వేదికలో నమోదు చేసుకున్నాయని ఆయన వెల్లడించారు.

ప్రభుత్వ నియామక పరీక్షల వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు ఏర్పాటు చేసిన ఉన్నతస్థాయి నిపుణుల కమిటీ సిఫార్సుల అమలు పురోగతిలో ఉందని మంత్రి తెలిపారు. ఆ కమిటీ చేసిన మొత్తం 46 సిఫార్సుల్లో ఇప్పటికే 35 సిఫార్సులను అమలు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. వీటిలో ఆధార్ ఆధారిత బయోమెట్రిక్ ధృవీకరణ, కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత ముఖ గుర్తింపు ధృవీకరణ, బహుళస్థాయి తనిఖీలు, సీసీటీవీ నిఘా, సిగ్నల్ జామర్లు, రాష్ట్ర, జిల్లా స్థాయి సమన్వయ కమిటీలు, ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలు, జాతీయ పరీక్షల సంస్థ (ఎన్‌టీఏ) పునర్వ్యవస్థీకరణ వంటి కీలక చర్యలు అమలులోకి వచ్చాయని ఆయన వివరించారు.

ప్రభుత్వ నియామక పరీక్షల వ్యవస్థ సమగ్రతను మరింత బలోపేతం చేయాలంటే ప్రభుత్వం, విద్యాసంస్థలు, తల్లిదండ్రులు, విద్యార్థులు, సమాజంలోని అన్ని వర్గాలు సమిష్టిగా భాగస్వామ్యం కావాల్సిన అవసరం ఉందని డాక్టర్ జితేంద్ర సింగ్ స్పష్టం చేశారు. అన్ని వర్గాల నుంచి వచ్చే నిర్మాణాత్మక సూచనలను ప్రభుత్వం ఎల్లప్పుడూ స్వాగతిస్తుందని పునరుద్ఘాటించిన ఆయన, లక్షలాది మంది విద్యార్థులు, ఉద్యోగార్థుల ఆశయాలను పరిరక్షిస్తూ ప్రభుత్వ పరీక్షల వ్యవస్థను నిష్పాక్షికంగా, పారదర్శకంగా, విశ్వసనీయంగా, అక్రమాలకు తావులేకుండా మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం తన కృషిని కొనసాగిస్తుందని తెలిపారు.

## హైదరాబాద్‌లో ముగిసిన 11వ అఖిల భారత పోలీస్ జూడో క్లస్టర్ ఛాంపియన్‌షిప్-2026

న్యూఢిల్లీ, జులై 31అఖిల భారత పోలీసు క్రీడల నియంత్రణ బోర్డు (ఏఐపీఎస్‌సీబీ) ఆధ్వర్యంలో కేంద్ర పారిశ్రామిక భద్రతా బలగం (సీఐఎస్ఎఫ్) నిర్వహించిన 11వ అఖిల భారత పోలీసు జూడో క్లస్టర్ ఛాంపియన్‌షిప్-2026 ఈ రోజు ముగిసింది. ముగింపు కార్యక్రమాన్ని హైదరాబాద్ గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి ఇండోర్ స్టేడియంలో నిర్వహించారు. తెలంగాణ పోలీసు డైరెక్టర్ జనరల్ (హెచ్ఓపీఎఫ్) ఐపీఎస్ శ్రీ సి.వి. ఆనంద్ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సీఐఎస్ఎఫ్ ప్రధాన కార్యాలయ ఏడీజీ ఐపీఎస్ శ్రీ విజయప్రకాశ్, ఐపీఎస్ శ్రీ ఎస్. సంబంధన్ (డీఐబీ ప్రతినిధి), ఎన్ఐఎస్ఏ-హైదరాబాద్ డైరెక్టర్ శ్రీమతి హర్‌ప్రీత్ కౌర్, ఏఐపీఎస్‌సీబీ అధికారులు, ఇతర ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ముఖ్య అతిథి ఐపీఎస్ శ్రీ సి.వి. ఆనంద్ సభనుద్దేశించి ప్రసంగిస్తూ నిర్వాహకులను అభినందించారు. దేశవ్యాప్తంగా ఉన్న రాష్ట్ర పోలీసు దళాలు, కేంద్ర సాయుధ పోలీసు దళాలకు చెందిన 36 జట్లను ఒక్కచోట చేర్చి, ఈ ఛాంపియన్‌షిప్‌ను అత్యంత సమర్థంగా నిర్వహించడం ప్రశంసనీయమన్నారు. ఇలాంటి క్రీడా కార్యక్రమాలు పతకాలకు అతీతంగా జాతీయ సమైక్యతను బలోపేతం చేస్తాయనీ, పోలీసు దళాల మధ్య సోదరభావాన్ని పెంపొందిస్తాయనీ శ్రీ సి.వి. ఆనంద్ అన్నారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన జట్లకు ఆయన ట్రోఫీలను అందించారు. ఓవరాల్ ట్రోఫీ విజేత ఎస్‌ఎస్‌బీ, రెండో స్థానంలో నిలిచిన సీఐఎస్ఎఫ్, మూడో స్థానాన్ని సాధించిన ఐటీబీపీ జట్లను అభినందించారు. అద్భుత ప్రతిభ కనబరిచి వ్యక్తిగత పతకాలను సొంతం చేసుకున్న విజేతలకు అభినందనలు తెలిపారు. వచ్చే రెండేళ్లలో హైదరాబాదులో అఖిల భారత పోలీసు క్రీడా పోటీలకు తెలంగాణ పోలీసులు ఆతిథ్యమివ్వనున్నారని ప్రకటిస్తూ.. గౌరవ ప్రధానమంత్రి దార్శనికతతో ప్రపంచ క్రీడా శక్తిగా భారత్ ఎదుగుతోందని ఆయన వ్యాఖ్యానించారు. క్రీడలు, దేహదారుఢ్యాన్ని దైనందిన జీవితంలో అంతర్భాగం చేసుకోవాల్సిందిగా పోలీసు సిబ్బందికి ఆయన విజ్ఞప్తి చేశారు. శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉన్న అధికారులు దేశానికి మరింత సమర్థంగా సేవలందిస్తారన్నారు.

ఈ పోటీలో దేశవ్యాప్త పోలీసు బలగాల విజయాలను ఐపీఎస్ శ్రీ సంబంధన్ (డీఐబీ ప్రతినిధి) అభినందించారు. ఈ ఛాంపియన్‌షిప్‌ను అద్భుతంగా నిర్వహించారంటూ ప్రశంసించారు. సాయుధ బలగాల్లో పెరుగుతున్న క్రీడా నైపుణ్యాన్ని అభినందించారు. పారిస్ ఒలింపిక్స్‌లో 11 మంది పోలీసు సిబ్బంది భారత్‌కు ప్రాతినిధ్యం వహించిన విషయాన్ని ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. 2025-26 జాతీయ ఛాంపియన్‌షిప్‌లో 109 పతకాలనూ, 2025 ప్రపంచ పోలీస్ - ఫైర్ గేమ్స్‌లో 613 పతకాలనూ సాధించారని గుర్తు చేశారు. 2029 ప్రపంచ పోలీసు- ఫైర్ గేమ్స్‌కు గుజరాత్‌లోని అహ్మదాబాద్ ఆతిథ్యం ఇవ్వనుందని కూడా ఆయన ప్రకటించారు. దేశ భద్రతా బలగాల క్రీడా ప్రస్థానంలో ఇది కీలక మైలురాయిగా నిలుస్తుందన్నారు. ఈ సందర్భంగా సీఐఎస్ఎఫ్ ప్రధాన కార్యాలయ ఏడీజీ, ఐపీఎస్ శ్రీ విజయ్ ప్రకాశ్ మాట్లాడుతూ.. విజేతలుగా నిలిచిన జట్లకు, పతక విజేతలకు అభినందనలు తెలిపారు. పతకాలు సాధించని క్రీడాకారులు.. ఈ అనుభవాన్ని భవిష్యత్ విజయానికి సోపానంగా భావించాలని సూచించారు. దేశ సరిహద్దులనూ, కీలకమైన మౌలిక సదుపాయాలనూ కాపాడేందుకు సిద్ధంగా ఉన్న ఈ చేతులే.. దేశానికి బంగారు పతకాలను కూడా సాధించి పెట్టగలవన్నారు.

# కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరువ చేయాలి

## - పీఐబీ ఏడీజీ శ్రీమతి శృతి పాటిల్

న్యూఢిల్లీ, జులై 31కేంద్ర ప్రభుత్వ పథకాలను మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని పత్రికా సమాచార కార్యాలయం (పీఐబీ) అడిషనల్ డైరెక్టర్ జనరల్ శ్రీమతి శృతి పాటిల్ పేర్కొన్నారు. గత 12 శాఖల పరిధిలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను, గత 12 సంవత్సరాల్లో సాధించిన ముఖ్య విజయాలను వివరించారు. చేపడుతున్న కార్యక్రమాల గురించి అడిషనల్ డైరెక్టర్ జనరల్ శ్రీమతి శృతి పాటిల్ ప్రజెంటేషన్ ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వ సంస్థలకు ప్రచార కార్యక్రమాలపై




ఏళ్లలో కేంద్ర ప్రభుత్వం సాధించిన విజయాలపై గురువారం కవాడిగూడలోని సీజీవో టవర్స్‌లో పీఐబీ 'వార్త' వర్క్‌షాప్ నిర్వహించింది. ఈ కార్యక్రమానికి ఇంటర్ మీడియా పబ్లిసిటీ కోఆర్డినేషన్ కమిటీ(ఐఎంపీసీసీ)లో భాగంగా ఉన్న వివిధ కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వ శాఖలు, విభాగాలు, ప్రభుత్వ రంగ సంస్థలు (పీఎస్‌యూ)లకు చెందిన ఉన్నతాధికారులు హాజరయ్యారు. తమ ప్రజలకు మరింత సమర్థవంతంగా చేరువయ్యేందుకు భవిష్యత్తులో చేపట్టాల్సిన ప్రచార కార్యక్రమాలు, మీడియా ద్వారా ప్రభుత్వ కార్యక్రమాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు చేపట్టాల్సిన చర్యలపై వారు విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా పీఐబీ విధులు, కేంద్ర ప్రభుత్వ విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు సహకారం అందించేందుకు పీఐబీ ఎల్లవేళలా సిద్ధంగా ఉంటుందని ఆమె పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలు, పథకాలను ఎక్కువ మంది ప్రజలకు చేరువ చేసి, వారు లబ్ధి పొందేలా చూడటమే లక్ష్యంగా పనిచేస్తున్నట్టు చెప్పారు.

ఈ కార్యక్రమంలో వివిధ కేంద్ర ప్రభుత్వ సంస్థల ఉన్నతాధికారులు, పీఐబీ, సీబీసీ అధికారులు పాల్గొన్నారు.

# రైతుల్లో చిగురిస్తున్న ఆశలు

## -ఎస్సారెస్పీకి ఒక్కరోజులోనే భారీగా ఇన్‌ఫ్లో

కామారెడ్డి, జులై 31:రెండు మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఎస్సారెస్పీకి భారీగా వరద వచ్చి చేరుతున్నది. వానాకాలం ప్రారంభమైన రెండునెలలకు ఇన్‌ఫ్లో రావడంతో రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు లేకపోవడం, మరోవైపు ఎస్సారెస్పీ డెడ్‌స్టోరేజీకి దగ్గరలో ఉండడం, జూలై ఒకటిన సుప్రీంకోర్టు తీర్పు మేరకు మహారాష్ట్రలో ఉన్న బాబ్లీ ప్రాజెక్ట్ గేట్లు ఎత్తినప్పటికి ఎస్సారెస్పీకి వరద రాకపోవడంతో వానాకాలం సాగుపై రైతులు ఆందోళన చెందారు.

ఒకవైపు వర్షాలు లేక, మరోవైపు ప్రాజెక్ట్‌లో నీళ్లు లేకపోవడంతో రివర్స్‌పంపింగ్ ద్వారా వరదకాలువలోకి నీళ్లు తెప్పించాలనే రైతుల నుంచి డిమాండ్లు వెల్లువెత్తాయి. వాయుగుండం రూపంలో రెండుమూడు రోజులుగా వర్షాలు కురుస్తుండడం, ఎగువ మహారాష్ట్రలో సైతం వర్షాలు కురుస్తుండడంతో ఎస్సారెస్పీకి ఒక్కరోజులోనే భారీగా వరద రావడం ప్రారంభమైంది. దీంతో మరోరెండుమూడు రోజులు ఇదే పరిస్థితి కొనసాగితే ప్రాజెక్ట్‌కు జలకళ సంతరించుకుంటుందని, వానాకాలం పంటలకు ఢోకా ఉండదన్న ఆశతో రైతులు ఉన్నారు.

ఒక్కరోజులోనే భారీగా పెరిగిన వరద

ఎస్సారెస్పీకి ఒక్కరోజులోనే భారీగా వరద ప్రారంభమైంది. గురువారం సాయంత్రం 7గంటల ప్రాంతంలో ప్రాజెక్ట్‌కు 76,634 క్యూసెక్కుల వరద వచ్చినట్లు అధికారులు తెలిపారు. బుధవారం సాయంత్రం 6 గంటలకు కేవలం 3,500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, గురువారం ఉదయం 6 గంటలకు 6,250 క్యూసెక్కుల వరద వచ్చింది. ఉదయం 9గంటలకు 9,240 క్యూసెక్కుల వరద కొనసాగగా మధ్యాహ్నం 2గంటల వరకు 19,258 క్యూసెక్కులకు పెరిగింది.

సాయంత్రం 4గంటలకు 35,654 క్యూసెక్కులకు వరద పెరగగా, 5గంటలకు 48,147 క్యూసెక్కులు, 6గంటలకు 72,452 క్యూసెక్కుల వరద వచ్చింది. ఒక్కరోజులోనే దాదాపు 2టీఎంసీల నీరు ప్రాజెక్ట్‌లోకి వచ్చిచేరింది. వర్షాకాలం ప్రారంభమైనప్పటి నుంచి ఇదే ప్రాజెక్ట్‌కు వచ్చిన భారీ వరదగా చెప్పవచ్చు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1091అడుగులు(80.5టీఎంసీలు) కాగా ప్రస్తుతం ప్రాజెక్ట్‌లో 1066.8అడుగుల (18.444టీఎంసీలు)నిల్వ ఉన్నది. ప్రాజెక్ట్ నుంచి అవుట్‌ఫ్లో 751 క్యూసెక్కులు కాగా, కాకతీయ కాలువకు 300 క్యూసెక్కులు, మిషన్‌భగీరథకు 231 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తుండగా 220 క్యూసెక్కుల నీరు ఆవిరిరూపంలో వెళ్తున్నది.

# గూడూరు శ్రీగురు పీఠంలో చోరీ..నగదు అపహరణ



మెదక్, జులై 31:మెదక్ జిల్లా శివ్వంపేట మండలం గూడూరు గ్రామంలోని శ్రీగురు పీఠంలో ఉన్న శ్రీ దత్తాత్రేయ మహాస్వామి, శ్రీ షిర్డీ సాయిబాబా దేవాలయాల్లో గురువారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తి చోరీకి పాల్పడ్డాడు. రెండు ఆలయాల హుండీలను పగులగొట్టి వాటిలో ఉన్న నగదును అపహరించి పరారయ్యాడు.

శుక్రవారం ఉదయం ఆలయ కార్యనిర్వహకుడు సత్యనారాయణ గౌడ్ దేవాలయానికి వచ్చి పరిశీలించగా డోర్లు, హుండీలు పగులగొట్టిన విషయం గుర్తించాడు.

వెంటనే ఆలయ చైర్మన్ శివకుమార్ గౌడ్‌కు సమాచారం అందించడంతో పాటు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సమాచారం అందుకున్న ఎస్ఐ మధుకర్ రెడ్డి తన సిబ్బందితో కలిసి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనంతరం క్లూస్ టీం సంఘటనా స్థలానికి చేరుకుని వేలిముద్రలు, ఇతర ఆనవాళ్లను సేకరించింది. ఆలయంలో ఏర్పాటు చేసిన సీసీటీవీ కెమెరాల ఫుటేజీలను కూడా పోలీసులు పరిశీలించారు. ఈ ఘటన పై దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే రాయిన్‌పల్లి ప్రాజెక్ట్ దెబ్బతింది : పద్మాదేవేందర్ రెడ్డి

మెదక్, జులై 31: గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మెదక్ మండలం రాయినపల్లి ప్రాజెక్టు డిస్ట్రిబ్యూషన్ కెనాల్ కూలిపోగా, చెరువు కట్ట కూడా సగానికి పైగా దెబ్బతినడంతో ఏడు గ్రామాల ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. శుక్రవారం చెరువు కట్టను మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్‌రెడ్డి బీఆర్ఎస్ నాయకులతో కలిసి పరిశీలించి ప్రభుత్వ నిర్లక్ష్యమే ఈ పరిస్థితికి కారణమని తీవ్రస్థాయిలో విమర్శించారు. గత ఏడాది వరదల్లో దెబ్బతిన్న కాల్వలు, చెరువులు, రహదారులకు శాశ్వత మరమ్మతులు చేయకుండా తాత్కాలిక పనులతో సరిపెట్టడంతోనే నేడు డిస్ట్రిబ్యూషన్ కెనాల్ పూర్తిగా కూలిపోయిందని ఆరోపించారు.

మూడు రోజుల వర్షాలకే కాల్వ కట్ట, చెరువు కట్ట దెబ్బతినడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమన్నారు. రైతుల ప్రాణాలతో ప్రభుత్వం చెలగాటమాడుతోందని మండిపడ్డారు. ప్రాజెక్టు డిస్ట్రిబ్యూషన్ కెనాల్ ద్వారా సుమారు 2500 ఎకరాలకు సాగునీరు అందడంతో పాటు ఏడు గ్రామాలకు ప్రత్యక్షంగా, మరో పది గ్రామాలకు పరోక్షంగా నీటి సరఫరా జరుగుతుందని తెలిపారు. ప్రస్తుతం కాల్వ దెబ్బతినడంతో రైతుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందన్నారు. రెండు నెలల క్రితమే రైతులతో కలిసి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేసి మరమ్మతులు చేపట్టాలని కోరినా ప్రభుత్వం, ఇరిగేషన్ అధికారులు పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పుడు కెనాల్ పూర్తిగా కొట్టుకుపోవడంతో చెరువు కట్టకూ పెనుముప్పు ఏర్పడిందని, కామారెడ్డి జిల్లా దంతేపల్లి వైపు నుంచి వరద ప్రవాహం పెరిగితే పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారే అవకాశం ఉందని హెచ్చరించారు.

# ఆక్వా పార్కుల అభివృద్ధి

న్యూఢిల్లీ, జులై 31 కేంద్ర మత్స్య, పశుసంవర్ధక, పాడిపరిశ్రమ మంత్రిత్వ శాఖ పరిధిలోని మత్స్య శాఖ... ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన (పీఎంఎంఎస్‌వై) కింద సమీకృత అక్వా పార్కుల నిర్మాణాన్ని చేపడుతోంది. మత్స్య, ఆక్వాకల్చర్ విలువ వ్యవస్థ వ్యాప్తంగా స్థానిక అవసరాలకు తగిన సమగ్ర పరిష్కారాలను అందించడం, వివిధ మత్స్య కార్యకలాపాలకు వీటిని కేంద్రాలుగా తీర్చిదిద్దడం ఈ పథకం ప్రధాన లక్ష్యం. దీనిలో భాగంగా పీఎంఎంఎస్‌వై కింద దేశవ్యాప్తంగా మొత్తం రూ. 713.80 కోట్ల అంచనా వ్యయంతో 12 సమీకృత అక్వాపార్కుల ఏర్పాటుకు మత్స్య శాఖ ఆమోదం తెలిపింది. అందులో సీఫుడ్ ప్రాసెసింగ్ పార్కు, రొయ్యలు, సముద్ర చేపలు, పీతలు, సముద్రపు నాచు, అలంకార చేపల పెంపకం వంటి అనేక విభాగాలతో కూడిన సమీకృత ఆక్వా పార్కు కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సమర్పించిన ప్రతిపాదనకు రూ. 88.08 కోట్ల అంచనా వ్యయంతో ఆమోదం లభించింది.

పీఎంఎంఎస్‌వైలోని కేంద్ర ప్రాయోజిత పథకం (సీఎస్ఎస్) పరిధిలోని వ్యక్తిగత లబ్ధిదారునిపై ఆధారపడని ప్రాజెక్టుల విభాగం కింద ఈ సమీకృత అక్వా పార్కులను నిర్మిస్తారు. ఈ మార్గదర్శకాల ప్రకారం రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు అమలు చేసే ఇటువంటి కార్యకలాపాల ప్రాజెక్టు వ్యయాన్ని, నిర్దేశిత నిధుల పంపిణీ విధానం అనుసరించి కేంద్రం, రాష్ట్రం, కేంద్రపాలిత ప్రాంతం పంచుకుంటాయి. ఈశాన్య రాష్ట్రాలు, హిమాలయ ప్రాంత రాష్ట్రాలకు సంబంధించి 90 శాతం నిధులను కేంద్ర ప్రభుత్వం, 10 శాతం నిధులను సంబంధిత రాష్ట్ర ప్రభుత్వం భరిస్తాయి. ఆంధ్రప్రదేశ్ సహా ఇతర సాధారణ రాష్ట్రాలలో ప్రాజెక్టు వ్యయంలో 60 శాతం కేంద్ర వాటాగా, 40 శాతం రాష్ట్ర వాటాగా ఉంటుంది. చట్టసభలు ఉన్నవి, లేనివి అనే తేడా లేకుండా అన్ని కేంద్రపాలిత ప్రాంతాల్లో 100 శాతం నిధులను పూర్తిగా కేంద్ర ప్రభుత్వమే సమకూరుస్తుంది.

కేంద్ర మత్స్య, పశుసంవర్ధక, పాడిపరిశ్రమ మంత్రిత్వ శాఖలోని మత్స్య శాఖ పీఎంఎంఎస్‌వైతో పాటు ఇతర పథకాల ద్వారా మత్స్య, ఆక్వాకల్చర్ రంగంలో ప్రాసెసింగ్ సామర్థ్యం, బ్రాండింగ్, ఎగుమతుల ఆధారిత తయారీని పెంచడానికి పలు కీలక చర్యలు చేపట్టింది. (తి) ప్రాంతాల వారీగా విలువాధారిత, ప్రాసెసింగ్ కార్యకలాపాలను ప్రోత్సహించడానికి 34 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో 34 ఉత్పత్తి, ప్రాసెసింగ్ క్లస్టర్లను ప్రకటించారు.

# తీర ప్రాంత మత్స్య పరిశ్రమలో మహిళల కోసం సముద్ర ఆర్థిక వ్యూహం

న్యూఢిల్లీ, జులై 31ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన (పీఎంఎంఎస్‌వై) పరిధిలో ఆంధ్రప్రదేశ్ సహా తీర ప్రాంతాల్లోని మహిళలకు ప్రాధాన్యం కల్పిస్తూ.. వారి ఉద్యోగ, జీవనోపాధి అవసరాలు సముద్ర ఆర్థిక వ్యవస్థ విధాన నియమావళిలో ఏకీకృతమయ్యాయి. ఈ పథకం మహిళలను ప్రధాన లబ్ధిదారు బృందంగా గుర్తించి, మత్స్య, ఆక్వాకల్చర్ రంగంలో వారి భాగస్వామ్యానికి, సాధికారతకు మద్దతు అందించేలా అధిక ఆర్థిక సాయాన్నీ, లక్షిత కార్యక్రమాలనూ అందిస్తుంది. ప్రభుత్వం నుంచి 60 శాతం వరకు ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం పొందడానికి మహిళా లబ్ధిదారులు అర్హులు. సాధారణ కేటగిరీకి చెందిన వారికి 40 శాతం మాత్రమే ఆర్థిక సాయం లభిస్తుంది. ఇది వ్యక్తిగత, సామూహిక కార్యకలాపాలు రెండింటికీ వర్తిస్తుంది. తద్వారా మత్స్య సంబంధిత వ్యాపారాలకు నిధులు సమకూర్చుకోవడం మహిళలకు సులభతరమవుతుంది.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తెలియజేసిన వివరాల ప్రకారం, సహకార సంస్థలను బలోపేతం చేసేందుకు వ్యూహాత్మక కార్యక్రమాన్ని ఆంధ్రప్రదేశ్ మత్స్యకార సహకార సంస్థ (ఏఎఫ్‌సీఓఎఫ్) చేపట్టింది. దీనిలో భాగంగా నెల్లూరుతో సహా ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా మత్స్య రైతు ఉత్పత్తి సంఘాలు (ఎఫ్ఎఫ్‌పీవోలు) ఏర్పాటు చేయడం సులభతరమవుతుంది. అలాగే మహిళల నేతృత్వంలోని సహకార సంస్థలకు ప్రత్యేక ప్రాధాన్యం లభిస్తుంది. సమష్టి ప్రయత్నం, సంస్థాగత మద్దతు ద్వారా మత్స్య రైతులకు సాధికారత కల్పించడమే ఈ పథకం లక్ష్యం. అంతేకాకుండా.. భారత ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన, ప్రధానమంత్రి మత్స్య కిసాన్ సమృద్ధి సహయోజన (పీఎం-ఎంకేఎస్ఎస్‌వై) పథకాల ద్వారా అందుబాటులో ఉన్న ఆర్థిక సాయం, మౌలిక సదుపాయాలు, సామర్థ్యం పెంపు, ఇతర ప్రయోజనాలను పొందేలా ఎఫ్ఎఫ్‌పీవోలకు వీలు కల్పిస్తుంది.

చేపల ఉత్పత్తిని, ఉత్పాదకతను పెంచడం, విలువైన వ్యాపార వ్యవస్థను ఆధునికీకరించడంలో భాగంగా సముద్రం లోతుల్లో చేపల వేటను, వేట యాంత్రీకరణను ప్రోత్సహించడానికి పీఎంఎంఎస్‌వైతో సహా మత్స్య శాఖ అమలు చేస్తున్న విధానాలు, పథకాలు అధిక ప్రాధాన్యమిస్తాయి. మత్స్యకార మహిళల సంప్రదాయ జీవనోపాధిని కాపాడటానికీ, బలోపేతం చేయడానికీ పీఎంఎంఎస్‌వై పరిధిలో ప్రత్యేక సాయం అందుతుంది. సాధారణ కేటగిరీకి చెందిన వారికి లభించే 40 శాతం ఆర్థిక సాయంతో పోలిస్తే... సముద్ర లోతుల్లో చేపల వేటకు ఉపయోగించే పడవలను కొనుగోలు చేయడంతో సహా మత్స్య రంగంలో వివిధ కార్యకలాపాల నిర్వహణకు 60 శాతం ఆర్థిక సాయాన్ని పొందేందుకు మహిళా లబ్ధిదారులు అర్హులు. అదేవిధంగా, సముద్ర నాచు సాగు, ఆర్నమెంటల్ ఫిషరీస్, వరి-చేపల సమగ్ర సాగు, కేజ్ కల్చర్, చేపల శుద్ధి, విలువ జోడింపు, మార్కెటింగ్ లాంటి విభిన్న ఆదాయ మార్గాలకు కూడా ఈ సబ్సిడీ వర్తిస్తుంది. తద్వారా జీవనోపాధిలో వైవిధ్యానికీ, స్థిరత్వానికీ ప్రోత్సాహం లభిస్తోంది.

ఆంధ్రప్రదేశ్‌తో సహా అన్ని రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల్లో మత్స్య సహకార సంఘాలను ఏర్పాటు చేయడానికి, వాటిని బలోపేతం చేయడానికి పీఎంఎంఎస్‌వై ద్వారా మత్స్య విభాగం తోడ్పాటును అందిస్తుంది. ఆంధ్రప్రదేశ్‌లో 66 మహిళా మత్స్యకార సహకార సంఘాలు.. మత్స్య రైతు ఉత్పత్తిదారుల సంఘాలు (ఎఫ్ఎఫ్‌పీవోలు)గా నమోదయ్యాయని/రూపాంతరం చెందాయని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తెలియజేసింది. 10 ఎఫ్ఎఫ్‌పీవోలకు నిర్వహణ వ్యయం, ఈక్విటీ గ్రాంట్ కింద మొత్తం రూ. 69,11,452 విడుదలయ్యాయి.

# ప్రపంచ వ్యాప్త వెబ్ దినోత్సవం... జ్ఞాన విప్లవానికి నాంది పలికిన దినం

ఆధునిక సమాచార విప్లవాన్ని చాటే మైలురాయిగా నిలిచింది ప్రపంచ వ్యాప్త వెబ్ ఆవిష్కరణ. ఇది కేవలం సాంకేతిక సౌలభ్యానికి మించిన మార్పు. ఇది ప్రపంచాన్ని కొత్తగా అనుసంధానించిన సామూహిక విజ్ఞాన వేదిక. వెబ్ అనేది ఒక సాంకేతిక ఆవిష్కరణకే కాదు, మానవతా దృక్కోణానికి ప్రతిరూపం. జ్ఞానం అందరికి అందుబాటులోకి రావాలన్న లక్ష్యంతో ప్రారంభమైన ఈ ప్రయాణం, ప్రపంచాన్ని ఒక ఊరి వంటిదిగా మార్చింది. ఈ వెబ్ అభివృద్ధికి, అందరికీ వినియోగ యోగ్యంగా మారడాన్ని పురస్కరించుకొని, జ్ఞానాన్ని, సంప్రదింపును, సంబంధాలను ప్రపంచ వ్యాప్తంగా విస్తరించిన ఈ వ్యవస్థ ఆవిష్కరణకు గుర్తుగా ప్రతి సంవత్సరం ఆగస్టు 1న ప్రపంచ వ్యాప్త వెబ్ దినోత్సవాన్ని జరుపు కుంటున్నారు.

వరల్డ్ వైడ్ వెబ్ సృష్టికి ఆద్యుడు బ్రిటిష్ కంప్యూటర్ శాస్త్రవేత్త టిమ్ బెర్నర్స్-లీ. 1989లో స్విట్జర్లాండ్ లోని యూరోపియన్ ఆర్గనైజేషన్ ఫర్ న్యూక్లియర్ రీసెర్చ్ లో పనిచేస్తున్నప్పుడు, సమాచారాన్ని సులభంగా పంచుకోవడానికి మరియు నిర్వహించడానికి ఒక మార్గం అవసరాన్ని ఆయన గుర్తించారు. దాని ఫలితంగా, ఆయన 1989లో "ఇన్ఫర్మేషన్ మేనేజ్‌మెంట్: ఎ ప్రపోజల్" అనే పేరుతో ఒక పరిశోధనా పత్రాన్ని సమర్పించారు, ఇది వెబ్ పునాదికి దారితీసింది.

సర్ టిమ్ బెర్నర్స్-లీ రూపొందించిన వర్డ్ వైడ్ వెబ్ (డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ) అన్నిటికంటే ముందుగా, సమాచారాన్ని స్వేచ్ఛగా, విస్తృతంగా పంచుకునే సాంకేతిక పరిష్కారంగా పరిగణించబడింది. 1991లో ఇది ప్రజలకు అందుబాటులోకి రాగా, 1993లో మొదటి గ్రాఫికల్ బ్రౌజర్ "మోజాయిక్" విడుదలైనప్పటి నుంచి వెబ్ వినియోగంలో విపరీతమైన వృద్ధి కనిపించింది.

ఈ రోజు ప్రపంచ వ్యాప్తంగా సుమారు 5.5 బిలియన్ల మందికి పైగా ఇంటర్నెట్ వినియోగదారులు ఉన్నారు. అంటే ప్రపంచ జనాభాలో 65 శాతానికి పైగా ప్రజలు ఇంటర్నెట్ ద్వారా కనెక్ట్ అయ్యారు. వీరిలో దాదాపు 92 శాతం మంది మొబైల్ ద్వారా ఇంటర్నెట్‌ను వాడుతున్నారు.

రోజుకు కనీసం 300 కోట్ల మందికి పైగా వెబ్‌సైట్లను సందర్శిస్తున్నారు. ప్రతిరోజూ సగటున 4.7 గంటల సమయాన్ని మనం ఇంటర్నెట్ వినియోగంలో

**ఆగస్టు 1...ప్రపంచ వ్యాప్త వెబ్ దినోత్సవం**



గడుపుతున్నాం. ఇది మానవ జీవనశైలిని ఎలా మార్చిందన్నదికి ప్రతీక.

వెబ్ ద్వారానే ప్రపంచవ్యాప్తంగా విద్య, వ్యాపారం, ఆరోగ్యం, వార్తా ప్రసారం, కమ్యూనికేషన్, వినోదం, ప్రభుత్వ పరస్పర చర్యల వరకూ అందుబాటులోకి వచ్చాయి. విద్యారంగంలో ఆన్‌లైన్ క్లాసులు, ఓపెన్ యూనివర్సిటీలు, వీడియో లెక్చర్లతో నిర్జన గ్రామాల్లో ఉన్న విద్యార్థులకూ ప్రపంచ స్థాయి విద్యను చేరవేసింది.

వ్యాపార రంగంలో ఈ-కామర్స్, ఆన్‌లైన్ పేమెంట్స్ ద్వారా వినియోగదారులు, వ్యాపారులు ఒకే వేదికపైకి వచ్చారు. ఆరోగ్యరంగంలో టెలీ మెడిసిన్, డిజిటల్ హెల్త్ రికార్డులు, టెస్ట్ రిపోర్టులు డిజిటల్ ద్వారా అందుబాటులోకి రావడం ద్వారా వైద్య సేవలు వేగవంతమయ్యాయి.

ఈ ప్రయోజనాల నడుమ కూడా కొన్ని ప్రధాన సవాళ్లు నిలిచినవే. డిజిటల్ విభజన పెరుగుతోంది. ప్రపంచవ్యాప్తంగా ఇంకా దాదాపు 2.7 బిలియన్ల మందికి ఇంటర్నెట్ అందుబాటులో లేదు. వీరిలో చాలా మంది మహిళలు, గ్రామీణ ప్రాంతాలవారు, అభివృద్ధి చెందని దేశాల ప్రజలు. ఈ అసమానతలను తొలగించేందుకు ప్రపంచవ్యాప్తంగా డిజిటల్ సామరస్యానికి ప్రయత్నాలు జరుగుతున్నా, మరింత సమర్థవంతంగా, సమగ్రంగా అవి జరగాల్సిన అవసరం ఉంది.

మరోవైపు డేటా భద్రత, గోప్యత, నకిలీ సమాచారం వ్యాప్తి, హేట్ స్పీచ్, డార్క్ వెబ్ వంటి సమస్యలు వెబ్ వినియోగంలో ఉన్నత ప్రమాణాలకు సవాలుగా నిలుస్తున్నాయి.

ఇటువంటి తరుణంలో నిబంధనలు, అంతర్జాతీయ ఒప్పందాలు, సాంకేతిక భద్రతా వ్యవస్థలు అవసరం. అంతేకాక, ప్రజలలో డిజిటల్ సావధానతపై అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఉంది.

సర్ టిమ్ బెర్నర్స్ లీ "వెబ్ ఈజ్ ఫర్ ఎవరివన్" అని అన్నదానికి అనుగుణంగా, ఇది అన్నివర్గాల ప్రజలకు సమానంగా, న్యాయంగా లభించాలి.

వెబ్ ఆధారిత ప్రపంచంలో సమాచారం మాత్రమే కాదు, అవకాశాలు, అవకాశాలుగా మారిన నెవిగేషన్ కూడా అందరికీ సమానంగా ఉండాలి. అదే సత్యాన్ని ప్రపంచ వ్యాప్త వెబ్ దినోత్సవం ప్రతి సంవత్సరం మనకు గుర్తు చేస్తోంది.

ఈ సందర్భంగా మనం వెబ్‌ను కేవలం వినియోగించడానికే కాదు, దానిని బాధ్యతగా, ప్రజాస్వామ్య పరిరక్షణకు ఉపయోగపడే సాధనంగా అభివృద్ధి చేయాలన్న దిశగా ముందడుగు వేయాలి. ఇదే నిజమైన స్మార్ట్ ప్రోగ్రెస్, ఇదే డిజిటల్ మానవతా వికాన దిశగా ఆగస్టు 1 దినోత్సవం మనకు సందేశమిస్తోంది.



-రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

## సముద్రాల్ని చుట్టివచ్చిన త్రివిధ దళాల మహిళా అధికారుల బృందం



న్యూఢిల్లీ, జులై 31ఐఏఎస్‌వీ త్రివేణీ నౌకలో సముద్రాల్ని చుట్టి వచ్చిన త్రివిధ దళాలకు చెందిన తొమ్మిది మంది మహిళా అధికారులను కేంద్ర రక్షణ మంత్రి శ్రీ రాజ్‌నాథ్ సింగ్ ఈ రోజు.. అంటే 2026 జులై 30న సత్కరించారు. మొట్టమొదటి సారి అందరూ మహిళలే పాల్గొన్న 'సముద్ర ప్రదక్షిణ' సాహసయాత్ర ఇదే. రక్షణ మంత్రి న్యూఢిల్లీలో అధికారులతో మాట్లాడుతూ, 314 రోజుల్లో నాలుగు మహాసముద్రాలను దాటుతూ సుమారు 25,500 నాటికల్ మైళ్ల దూరం ప్రయాణించి యాత్రను విజయవంతంగా పూర్తి చేసి టీము కనబరిచిన సాహసాన్నీ, దృఢసంకల్పాన్నీ ప్రశంసించారు. ఈ యాత్ర మహిళాశక్తికి ప్రమాణంగా నిలవడమే కాకుండా త్రివిధ దళాల సహకారానికీ, సమన్వయానికీ ఓ అత్యుత్తమ ఉదాహరణగా కూడా ఉందని ఆయన అన్నారు. ఇది దేశంలో ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిని అందిస్తుందన్నారు.

మహిళా అధికారులు తమ యాత్రా విశేషాలను రక్షణ మంత్రికి వివరించారు. సవాళ్లతో కూడిన ఈ సాహస యాత్ర తమకు మరపురానిదిగాను, ఫలప్రదమైందిగాను నిలుస్తుందని అన్నారు. దేశ ప్రజలు సంతోషించే పనిని చేయాలన్న దృఢసంకల్పమే స్ఫూర్తిని అందించిందనీ, ఈ కారణంగానే, శారీరక, మానసిక సవాళ్లను ఎదుర్కోగలిగామని చెప్పారు.

మహిళా అధికారుల అంకితభావం తనకు స్ఫూర్తినివ్వడంతో పాటు స్వీయ సంకల్పాన్ని బలోపేతం చేసిందని రక్షణ మంత్రి అన్నారు. దృఢవిశ్వాసం, సంకల్పం ఉంటే జీవితంలో ఏ లక్ష్యాన్ని అయినా సాధించవచ్చని వారి విజయం చాటుతోందని శ్రీ రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. "అధికారుల సామర్థ్యం, ఆత్మవిశ్వాసం అద్భుతం" అని శ్రీ రాజ్‌నాథ్ సింగ్ కొనియాడుతూ, ఫలప్రదంగా ముగిసిన ఈ 'సముద్ర ప్రదక్షిణ'?. మహిళలు సాహసయాత్రలను చేయలేరన్న వాదనను పటాపంచలు చేసిందన్నారు. "శారీరక పటుత్వం, మానసిక దృఢత్వం, నాయకత్వ సామర్థ్యం.. ఇవి పురుషులు, మహిళలు అనే భేదానికి మించినవి అని మీరు నిరూపించారు. మిమ్మల్ని చూసి భారత్‌లో ప్రతి పుత్రికా తాను కూడా సముద్రాన్ని దాటివచ్చి ప్రపంచాన్ని గెలువగలనన్న నమ్మకాన్ని పెంచుకోగలుగుతుంది" అని అధికారులతో ఆయన వ్యాఖ్యానించారు.

ఈ ప్రయాణం 'త్రివిధ దళాల సమన్వయాని'కి ఒక చక్కని ఉదాహరణగా నిలుస్తుందని రక్షణ మంత్రి ప్రశంసించారు. భారత సైనిక, నౌకా, వైమానిక దళాల అధికారులు ఒకే జెండా నీడన, ఒకే ఉమ్మడి లక్ష్యంతో, కలిసికట్టుగా ఒకే నౌకలో సముద్రయానానికి వెళ్లారని ఆయన గుర్తు చేశారు. "మనం కలిసి ముందుకు కదిలితే ఏ దిగంతమూ గెలుచుకోలేనంతటి విశాలమైంది కాబోదు అనడానికి ఈ సాహసయాత్రే ఒక కొలమానం" అని ఆయన అన్నారు.

భారత ఇంజినీరింగ్ ప్రావీణ్యం, దేశీయ శక్తియుక్తుల్నీ, సాంకేతిక ప్రగతినీ బృందం తాను సందర్శించిన దేశాలకు చాటిచెప్పిందని శ్రీ రాజ్‌నాథ్ సింగ్ మెచ్చుకున్నారు. "ఏ రంగంలోనూ ఏ దేశానికీ భారత్ తీసిపోదు అనే సందేశాన్ని ప్రపంచానికి మీరు అందించారు" అని బృంద సభ్యులను ఆయన ప్రశంసించారు.

ఈ మాటామంతీ సందర్భంగా సైనిక దళ ప్రధానాధికారి జనరల్ ధీరజ్ సేత్, రక్షణ శాఖ కార్యదర్శి శ్రీ రాజేశ్ కుమార్ సింగ్, వైమానిక దళ ఉప ప్రధానాధికారి ఎయిర్ మార్షల్ ఆశుతోష్ దీక్షిత్, నౌకాదళ ఉప ప్రధానాధికారి వైస్ అడ్మిరల్ అజయ్ కొచర్‌తో పాటు త్రివిధ దళాలకు చెందిన ఇతర సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

రక్షణ మంత్రి ఈ నెల 22న ముంబయిలో ఐఏఎస్‌వీ త్రివేణి బృందానికి దృశ్య మాధ్యమ సహాయంతో స్వాగతం పలికారు. గత సంవత్సరం సెప్టెంబరు 11న ఇదే బృందం యాత్ర ప్రారంభ కార్యక్రమంలో కూడా ఆయన దృశ్య మాధ్యమ సహాయంతో పాలుపంచుకున్నారు.

ప్రతిదీ పక్కాగా రూపొందించిన ప్రణాళిక, ఇంచుమించు రెండు సంవత్సరాల పాటు విస్తృత శిక్షణ, తీర ప్రాంతం నుంచి నిరంతరాయంగా సహాయాన్ని అందించిన నెట్‌వర్కుతో పాటు అనేక సంస్థలు, సహాయక ఏజెన్సీల తిరుగులేని నిబద్ధత.. ఇవన్నీ ఈ సాహస యాత్ర సఫలం కావడంలో తమ వంతు పాత్రలను పోషించాయి. ప్రపంచ ప్రదక్షిణకు గాను అంతర్జాతీయ స్థాయి గుర్తింపు లభించిన అన్ని ప్రమాణాల్నీ ఈ సాహసయాత్ర విజయవంతంగా నెరవేర్చింది. ఈ ప్రమాణాల్లో.. అన్ని దేశాంతరాలనూ దాటడం, భూమధ్య రేఖ మీదుగా రెండు సార్లు పయనించడం, ఇంటర్నేషనల్ డేట్ లైన్ ను కూడా దాటడంతో పాటు సముద్రంలోకి చొచ్చుకొని ఉన్న మూడు మహా భూభాగాలు.. కేప్ లీయువిన్, కేప్ హార్న్, కేప్ ఆఫ్ గుడ్ హోప్.. చుట్టూరా తిరగడం వంటి మజిలీలు ఉన్నాయి.

కఠినతర డ్రేక్ జలసంధిని విజయవంతంగా దాటిన తరువాత కేప్ హార్నును చుట్టాక కేప్ హార్నర్సుకు సంబంధించిన ప్రతిష్ఠాత్మక సముదాయంలో సభ్యత్వం ఈ బృందానికి దక్కింది. ప్రపంచంలో అత్యంత సవాళ్లతో కూడిన సముద్ర మార్గాలలో ఒక మార్గాన్ని అధిగమించగలిగిన నావికులకు మాత్రమే ఈ గౌరవాన్ని ప్రదానం చేస్తారు.

'సముద్ర ప్రదక్షిణ' చెప్పుకోదగిన సముద్ర సంబంధిత విజయం. అంతేకాదు, సైన్య దౌత్యంతో ముడిపడిన ఒక శక్తిమంతమైన సాధనం కూడా. ప్రపంచవ్యాప్తంగా ఓడరేవులలో తన యాత్రను కొనసాగించిన క్రమంలో, ఐఏఎస్‌వీ త్రివేణి మిత్ర దేశాలతో సద్భావనను బలోపేతం చేయడమే కాకుండా భారత సుసంపన్న సాంస్కృతిక వారసత్వం, నౌకావాణిజ్య సంప్రదాయాలనూ, సైనిక వృత్తి నైపుణ్యాన్నీ, విలువలనూ చాటిచెప్పింది.

## అసిస్టెంట్ సబ్ ఇన్స్పెక్టర్- ఏఎస్ఐ సంజీవయ్య ఉద్యోగ విరమణ..ఘనంగా సత్కారం

కరీంనగర్, జులై 31:సమర్థవంతమైన సేవలతో మంచి గుర్తింపు లభిస్తుందని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా పేర్కొన్నారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ పెద్దపల్లి జోన్ పరిధిలోని గోదావరిఖని వన్ టౌన్ పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తూ ఉద్యోగ విరమణ పొందిన అసిస్టెంట్ సబ్ ఇన్స్పెక్టర్- ఏఎస్ఐ సంజీవయ్యను శుక్రవారం కమిషనరేట్ కార్యాలయంలో రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందజేశారు.

ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ ప్రతి ప్రభుత్వ ఉద్యోగి జీవితంలో ఉద్యోగ విరమణ అనేది సహజమైన ఘట్టమని పేర్కొన్నారు. పోలీస్ శాఖలో ప్రజల భద్రత, శాంతి భద్రతల పరిరక్షణ కోసం ఎన్నో సంవత్సరాల పాటు అంకితభావంతో సేవలందించిన సంజీవయ్య సేవలు ప్రశంసనీయ మైనవని కొనియాడారు. ఉద్యోగ విరమణ అనంతరం కూడా మీకు ఎలాంటి అవసరం వచ్చినా పోలీస్ శాఖ ఎల్లప్పుడూ మీకు అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

మీరు, మీ కుటుంబ సభ్యులు ఆయురారోగ్యాలతో, సుఖశాంతులతో జీవించాలని, పిల్లలు ఉన్నత స్థాయికి ఎదిగి జీవితంలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో అదనపు డీసీపీ కె. శ్రీనివాస్, ఏఓ శ్రీనివాస్, ఏఆర్ ఏసీపీ రమేష్, ఆర్ఐ రమేష్, రామగుండం పోలీస్ కమిషనరేట్ పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షులు బోర్లకుంట పోచలింగం, సీసీ సందీప్ లు పాల్గొన్నారు.

## గ్రామాల్లో ముమ్మరంగా పారిశుధ్య పనులు

ఖమ్మం, జులై 31:సీజనల్ వ్యాధుల నివారణ, ప్రజల ఆరోగ్య పరిరక్షణకు పంచాయతీ, వైద్య శాఖ సిబ్బంది ఆధ్వర్యంలో శుక్రవారం కారేపల్లి మండల వ్యాప్తంగా పారిశుధ్య పనులను ముమ్మరంగా నిర్వహించారు. ఫ్రై డే డ్రై డేలో భాగంగా గ్రామాల్లో పర్యటించి మురుగు కాలువల శుభ్రత, చెత్త, పాత టైర్లు, నీటి తొట్ల తొలగింపు, దోమల నివారణ చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించి ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. నివాస ప్రదేశాల్లో, చుట్టు పక్కన పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు వివరించారు. వర్షాకాలంలో అనారోగ్యాలకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలిపారు. అలాగే దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులను కలిసి క్రమం తప్పకుండా మందులు వాడాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో ఎం ఎల్ హెచ్ పి లు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## రెండో స్వదేశీ డైవింగ్ సపోర్ట్ నౌక అయిన 'నిపుణ్'ను నౌకాదళానికి అప్పగించిన హిందుస్థాన్ షిప్‌యార్డ్

న్యూఢిల్లీ, జులై 31స్వదేశీ పరిజ్ఞానంతో నిర్మించిన రెండో డైవింగ్ సపోర్ట్ వెసెల్ (డీఎస్‌వీ) 'నిపుణ్'ను హిందూస్థాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ (హెచ్ఎస్ఎల్) 2026 జులై 30న విశాఖపట్నంలో భారత నౌకాదళానికి అందించింది. ఈ నౌకను 'ఇండియన్ రిజిస్టర్ ఆఫ్ షిప్పింగ్ (ఐఆర్ఎస్)' వర్గీకరణ నియమాలకు అనుగుణంగా రూపకల్పన చేసి నిర్మించారు.

సంస్కృత భాషలో 'నిపుణ్' అంటే 'ఒక నిర్దిష్ట రంగంలో నైపుణ్యం, సామర్థ్యం, పూర్తి అవగాహన ఉన్నది' అని అర్థం. ఆ పేరుకు తగ్గట్టుగానే ఈ నౌక అత్యంత ప్రత్యేకమైనది. సముద్రంలో లోతైన డైవింగ్ ఆపరేషన్లు, రక్షణ చర్యలను చేపట్టే సామర్థ్యాన్ని కలిగి ఉంది.

ఈ నౌకలో అత్యంత ఆధునికమైన 'డైవ్ పరికరాలు' ఉన్నాయి. ఇది లోతైన సముద్రంలో 'సాచురేషన్ డైవింగ్' చేసే సామర్థ్యాన్ని కలిగి ఉంది. డైవింగ్ ఆపరేషన్లను నిర్వహించడానికి నౌక పక్క భాగంలో ఒక ప్రత్యేక 'డైవింగ్ స్టేజ్'ని కూడా ఏర్పాటు చేశారు. దీనిలోని 'రిమోట్లీ ఆపరేటెడ్ వెహికల్స్' (ఆర్ఓవీలు) డైవర్లను పర్యవేక్షించడం, నావికా వ్యర్థాలు లేదా మునిగిన వస్తువుల వెలికితీత పనులను సులభతరం చేయడం ద్వారా నౌక కార్యాచరణ సామర్థ్యాలను మరింత పెంచుతాయి. జలాంతర్గామిలో అత్యవసర పరిస్థితి ఏర్పడినప్పుడు సిబ్బందిని సురక్షితంగా తరలించడానికి 'డీప్ సబ్‌మర్జెన్స్ రెస్క్యూ వెసెల్'కి (డీఎస్ఆర్‌వీ) ఇది ఒక 'ప్రధాన నౌక (మదర్ షిప్)' కూడా వ్యవహరిస్తుంది.

దాదాపు 75 శాతం స్వదేశీ పరికరాలతో నిర్మితమైన 'నిపుణ్'ను నౌకాదళానికి అప్పగించటం.. భారత ప్రభుత్వ 'ఆత్మనిర్భర్ భారత్' దార్శనికతకు అనుగుణంగా స్వదేశీ నౌకా నిర్మాణంలో భారత నౌకాదళం సాధించిన మరొక ముఖ్యమైన మైలురాయి. లోతైన సముద్రపు డైవింగ్ ఆపరేషన్ల వంటి విశిష్ట రంగంలో భారత నౌకాదళ సామర్థ్యాలను మరింత పటిష్ఠం చేయడంలో ఈ నౌక చేరిక ఒక ప్రధాన ముందడుగుగా ఉంటుంది.

## ఓదెల మల్లన్న ఆలయ అభివృద్ధి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే



కరీంనగర్, జులై 31:పెద్దపల్లి జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఓదెల శ్రీ మల్లికార్జున స్వామి ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే విజయ రమణారావు శుక్రవారం పరిశీలించారు. మల్లన్న ఆలయంలో రూ. 15 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు జరుగుతున్నాయి.

ఈ సందర్భంగా ఆలయంలో అభివృద్ధి పనులు వాస్తు ప్రకారం జరిగే విధంగా దేవాదాయశాఖ, పంచాయతీరాజ్ అధికారులు, ఆలయ పాలక మండలి సభ్యులతో సమీక్షించారు.

అభివృద్ధి పనులు వేగవంతంగా జరగడంతో పాటు వాస్తుకు అనుకూలంగా జరగాలని సూచించారు.

ఇక్కడికి వచ్చే భక్తులకు అన్ని రకాల సౌకర్యాలతో పాటు ఆహ్లాదం కల్పించడానికి కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఎమ్మెల్యే వెంట ఆలయ చైర్మన్ చీకట్ల మొండయ్య, ఈవో సదయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మూల ప్రేమ్ సాగర్ రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ ఆళ్ల సుమన్ రెడ్డి, మాజీ చైర్మన్ గోపు నారాయణరెడ్డి, మాజీ సర్పంచ్ ఆకుల మహేందర్, మీనుగు సంతోష్, రాచర్ల రాకేష్, రెడ్డి రజనీకాంత్ గౌడ్ తదితరులు ఉన్నారు.

## రైతులు ఆరుతడి పంటల సాగుపై దృష్టి పెట్టాలి : కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



నల్గొండ, జులై 31:ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో రైతులు వరి సాగుకు బదులుగా ఆరుతడి పంటల సాగుపై దృష్టి సారించాలని జనగామ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సూచించారు. శుక్రవారం జిల్లాలోని బచ్చన్నపేట మండలం ఎద్దుగూడెం గ్రామంలో పంట పొలాలను పరిశీలించి రైతులతో మాట్లాడారు.

గ్రామంలో సాగు పరిస్థితులు, పంటల విస్తీర్ణం, దిగుబడులు, మార్కెట్ అవకాశాలు, ప్రభుత్వ ప్రోత్సాహక పథకాలపై రైతులతో సుదీర్ఘంగా చర్చించారు. గతంలో వరి సాగు చేసినప్పుడు వచ్చిన ఆదాయం, ప్రస్తుతం ప్రత్యామ్నాయ పంటల ద్వారా పొందుతున్న లాభాలపై రైతుతో చర్చించారు.

రైతుల అనుభవాలను ఇతర రైతులకు తెలియజేసి, వరి సాగుకు బదులుగా పెసర, నువ్వులు, కందులు, మిర్చి, బెండ, వాక్కాయలు వంటి ఆరుతడి పంటల సాగుపై అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు.

నీటి వినియోగం తక్కువగా ఉండే ఈ పంటలు ప్రస్తుతం ఉన్న వాతావరణ పరిస్థితులకు అనుకూలమని పేర్కొన్నారు. గ్రామంలో సమీకృత వ్యవసాయ విధానాన్ని అనుసరిస్తున్న రైతు పరమేశ్వర్ వ్యవసాయ క్షేత్రాన్ని కూడా కలెక్టర్ సందర్శించారు. డ్రమ్ సీడింగ్ పద్ధతిలో సాగు, వివిధ పంటల సమీకృత సాగు, ఆదాయ వనరుల వైవిధ్యీకరణ వంటి అంశాలను పర్యవేక్షించి, అభినందించారు.

వరి నాట్లు వేస్తున్న మహిళా కూలీలతో కలెక్టర్ మాట్లాడి, వారి ఉపాధి పరిస్థితులు, కూలీ వివరాలు తెలుసుకున్నారు. ఆరుతడి పంటలను ప్రోత్సహించడం ద్వారా రైతుల ఆదాయాన్ని కాపాడటంతో పాటు వ్యవసాయాన్ని స్థిరంగా కొనసాగించవచ్చని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీఏఓ అంబికా సోనీ, వ్యవసాయ శాఖ అధికారులు శరత్ చంద్ర , సర్పంచ్ నర్సింగ రావు , రైతులు పాల్గొన్నారు.

## కారుణ్య విద్యా భవన్‌లో ఘనంగా గ్రాండ్ పేరెంట్స్ డే వేడుకలు

ఖమ్మం, జూలై 31 : కరుణగిరి నగర్‌లోని కారుణ్య విద్యా భవన్ పాఠశాలలో గ్రాండ్ పేరెంట్స్ డే వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విద్యార్థుల తాతయ్యలు, అమ్మమ్మలు, నాయనమ్మలు పెద్ద సంఖ్యలో హాజరై సందడి చేశారు. ఈ సందర్భంగా చిన్నారులు తమ తాతయ్య, అమ్మమ్మ, నాయనమ్మల వేషధారణలో ఆకట్టుకుని అందరి ప్రశంసలు అందుకున్నారు. విద్యార్థులు నృత్యాలు, పాటలు, ప్రసంగాలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించి పెద్దలను అలరించారు. మనవలు, మనవరాళ్ల ప్రతిభను చూసిన గ్రాండ్ పేరెంట్స్ ఆనందం వ్యక్తం చేస్తూ పిల్లలను ఆశీర్వదించారు. పెద్దల అనుభవాలు, జీవన విలువలు, కుటుంబ బంధాల గొప్ప తనాన్ని చిన్నారులకు తెలియజేయాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు పాఠశాల యాజమాన్యం తెలిపింది. విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రాండ్ పేరెంట్స్ ఉత్సాహంగా పాల్గొనడంతో కార్యక్రమం విజయవంతమైంది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, సిబ్బంది, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమం ముగింపులో గ్రాండ్ పేరెంట్స్ కోసం ప్రత్యేకంగా సరదా ఆటల పోటీలు నిర్వహించగా, వారు ఎంతో ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar,Hyderabad-500020. Telangana.
'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.